# మిసిమి

మాస పత్రిక

సెప్టెంబర్-2004



రూ. 8/-





## సందేశం

చిత్రకారుడు : జె.యమ్. అహివాసి

(వివరాలు 332 వ పేజీలో)

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 15 | సెప్టెంబర్ 2004 | సంచిక 9

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఫ్రెడరిక్ మిస్త్రల్ — మూలం : సి.డి. ఆఫ్ విర్సెన్, అనువాదం: బి.వి. రామిరెడ్డి

వలస — - వింజనంపాటి రాఘవరావు

చిత్రకళా దిగ్గజం - అహివాసి — - కాంద్రేగుల నాగేశ్వరరావు

మైఖేల్ మధుసూదనదత్ - గురజాడ — - డా॥ యు.ఎ. నరసింహమూర్తి

శబ్ద 'చిత్ర' సంకేతం — - ఎల్.ఆర్. వెంకటరమణ

కావ్య లక్షణం - మరో ప్రదక్షిణం — - బి. జగన్నాథరావు

మార్పు — - కుమారస్వామి

విడిప్రతి రూ. 8/- వార్షిక చందా రూ. 100/- విదేశీయులకు $ 20

ముఖచిత్రం : **మహాభారతం లిఖిస్తున్న గణపతి**

చిత్రకారుడు : **అహివాసి**

Printed & Published by **Bapanna Alapati** at Kala Jyothi Process Pvt. Ltd.,
1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimieditor@rediffmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# LITERARY ANECDOTES

## ALFRED (849-901)

Now on a certain day his mother was showing him and his brothers a book of Saxon poetry, which she held in her hand, and finally said: 'Whichever of you can soonest learn this volume, to him will I give it.' Stimulated by these words, or rather by divine inspiration, and allured by the beautifully illuminated latter at the beginning of the volume, Alfred spoke before all his brothers, who, though his seniors in age, were not so in grace, and answered his mother: 'Will you really give that book to that one of us who can first understand and repeat it to you?' At this his mother smiled with satisfaction, and confirmed what she had before said: 'Yes,' said she, 'that I will.' Upon this the boy took the book out of her hand, and went to his master and learned it by heart, whereupon he brought it back to his mother and recited it.

After this he learned the daily course, that is, the celebration of the hours, and afterwards certain Psalms, and many prayers contained in a book which he kept day and night in his bosom, as I myself have seen, and always carried about with him, for the sake of prayer, through all the bustle and business of this present life. But, sad to relate, he could not gratify his ardent wish to acquire liberal art, because, as he was wont to say, there were at that time no good teachers in all the kingdom of the West Saxons.

## ROBERT SOUTH (1634-1716)

Dr. South, when once preaching before Charles II….. observed that the monarch and his attendants began to nod, and as nobles are common men when they are asleep, some of them soon after snored; on which he broke off his sermon, and called, 'Lord Lauderdale, let me entreat you to rouse yourself; you snore so loud that you will wake the King!'

* * * *

Dr. South, when he resided at Caversham in Oxfordshire, was called out of bed on a cold winter's morning by his clerk, to marry a couple who were then waiting for him. The doctor hurried up, and went shivering to church; but seeing only an old man of seventy, with a woman about the same age, and his clerk, he asked the latter in a pet where the bridegroom and the bride were, and what that man and woman wanted. The old man replying that they came there to be married, the doctor looked sternly at him and exclaimed, 'Married!' 'Yes, married', said the old man hastily; 'better marry than do worse. 'Go, get you gone, you silly old fools!' Said the doctor; 'get home and do your worst!' And then hobbled out of church in a great passion with his clerk for calling him out of bed on such a ridiculous errand.

# ఫ్రెడరిక్ మిస్ట్రల్

## (1904వ సంవత్సరపు నోబెల్ సాహితీ పురస్కారోపన్యాసం)

మూలం: సి.డి. ఆఫ్ విర్సెన్ అనువాదం: **బి.వి.రామిరెడ్డి**

(శాశ్వత కార్యదర్శి, స్వీడిష్ అకాడెమి)

నోబెల్‌సాహితీ పురస్కారాన్ని రచయితలకు వాళ్ళింకా ఉన్నత సృజన శక్తితో వయసులో వుండగానే ప్రదానంచేస్తే వారికి ఆర్థిక యిబ్బందులు లేకుండా, స్వేచ్ఛగా తమ రచనా వ్యాసంగాన్ని కొనసాగించుకునే అవకాశం వుంటుందని కొందరు అంటుంటారు. అయితే నోబెల్ ఫౌండేషన్ ఈపురస్కారాన్ని అత్యున్నత స్థాయికి చెందిన సాహిత్యాన్ని వెలువరించిన వారి సాహిత్యం వారి అనుభవంతో పరిపుష్టమయితేనే, వారికి ప్రదానం చేయాలని నిర్దేశిస్తున్నది. ఆవిధంగానే ఒక మహా మేధావి తన కళా శిఖరాలను చేరుకున్నాకే అంతిమంగా వారిని నిస్సందేహంగా ఎన్నుకుంటున్నది. ఆ విధంగానే స్వీడిష్ అకాడెమి యోమ్సెన్, జోర్నెసన్‌లకు వారు అత్యున్నత సాహితీ శిఖరాలను దాటాకనే వారికి ఈ సంవత్సరపు నోబెల్‌సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేయాలని నిర్ణయించింది.

ఈ అకాడెమి, ఇద్దరు రచయితల్ని అందుకు ఎంపిక చేసింది. వారిద్దరూ జీవితంలో, కవితా కళలో ఉత్తమ శిఖరాలను అందుకున్నారు. వీరిలో ఒకరి వయసు 74 సంవత్సరాలు, కాగా రెండవ రచయిత వయసు 72 సంవత్సరాలు. వారిద్దరి దృక్కోణాలు వేరయినా, వారిద్దరూ సమానమైన ఔన్నత్యాన్ని అందుకున్నందుకుగాను ఈ పురస్కారం మొత్తాన్ని ఇద్దరికీ సమానంగా పంచాలని నిర్ణయించాం. అంతమాత్రాన ఈ పురస్కారం ఔన్నత్యం తరగదనీ, అది మొత్తం పురస్కారంతో సమానమనీ భావిస్తున్నాం.

అకాడెమి పురస్కార గ్రహీతలలో మొదటి వ్యక్తి, కవి, ఫ్రెడరిక్ మిస్ట్రల్. ఈ కవి మన తరపు కవులందరి కంటే చిన్నవాడు. మిస్ట్రల్1830, సెప్టెంబరు 8న ఫ్రాన్స్‌లోని మెయానొ అనే గ్రామంలో జన్మించాడు. ఇది రోన్ లోయలోవుంది. ఈ కవి ఆ అందమైన ప్రకృతి పరిసరాల మధ్య సామాన్య ప్రజల మధ్య పుట్టి పెరిగి, వారి కార్యకలాపాలను గ్రహించాడు. ఆయన తండ్రి ఫ్రాంకో మిస్ట్రల్ ఒక సంపన్న వ్యవసాయదారుడు. ఆయన తమ ప్రాచీనుల నుండి వచ్చిన ఆచార వ్యవహారాలను స్థిరంగా నమ్మినవాడు. ఆయన తల్లి పారంపర్య వారసత్వాన్ని చిన్నతనం నుండి నూరిపోసింది.

యువకుడిగా అలినాన్ కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో, మహాకవులైన హోమర్, వర్జిల్‌ల రచనలను చదువుకున్నాడు. వాటి ప్రభావం ఆయన మీద బలంగాపడింది. ఆయన ఆచార్యుడైన రోమన్లిల్లె అతడి మాతృ భాష మీద అతనికి అమితమైన ప్రేమ కలిగేందుకు కారకుడయ్యాడు. తండ్రి కోరిక మేరకు ఐక్స్ - ఎన్- ప్రావిన్స్‌లో లా డిగ్రీ తీసుకున్నాక, కవిత్వానికి అంకితమయ్యాడు. తన భాషకు చెందిన నుడికారాలను, జాతీయాలను గ్రహించి, తన భాషను సాహిత్యభాషగా మలుచుకున్నాడు. అతని మొదటి ప్రయత్నం పల్లె జీవితాన్ని గురించిన పెద్ద కవిత. 1852లో తన కవితల్ని ''లిప్రావిన్స్

---

బి.వి. రామిరెడ్డి, సిద్ధార్థా ఆర్ట్స్ & సైన్స్ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేస్తున్నారు, విజయవాడ.

పేరుతో ప్రచురించాడు. ఏడు సంవత్సరాల కృషి ఫలితంగా 1859లో ''మిరెయో'' ప్రచురించాడు. ఇది ప్రపంచ ప్రసిద్ధమయింది.

ఈ కవితలోని విషయం సామాన్యమైనది. ఒక అందమైన, మంచిమనసుగల అమ్మాయి తాను ప్రేమించిన పేద యువకుణ్ణి తండ్రి అనంగీకారంవల్ల వివాహం చేసుకోలేకపోతుంది. దుఃఖంతో తల్లిదండ్రుల ఇంటిని వొదిలి, తీర్థయాత్రా స్థలమైన ముగ్గురు సెయింట్ మేరీల చర్చికి వెడుతుంది. మిరెయో కొండల కోనల మీదుగా చేసే ప్రయాణాన్ని కవి అద్భుతంగా వర్ణిస్తాడు. ఎండదెబ్బకు పడిపోయి ఆమె దొర్లుతూ ఆ చర్చి ముందు పడి ప్రాణాలు విడుస్తుంది. చనిపోతూండగా ఆముగ్గురు మరియలు ఆమెకు దర్శన మిస్తారు.

ఈ రచన గొప్పదనం విషయంలో గాని, ఊహాత్మకలోగాని లేదు. ఈ కథలోని సంఘటనలను కళాత్మంగా కలపడంలోను, సుందర దృశ్యాలను, స్మృతులను, ప్రాచీన ఆచారాలను, అలవాట్లను వర్ణించడంలోను కవి ప్రత్యేకత వ్యక్త మవుతుంది. హోమర్ సామ్యత ఇందులో కనుపిస్తుంది. ఇందులో కవి వ్యక్తిత్వం స్ఫుటంగా కనుపిస్తుంది. అతని వర్ణనల్లో స్వర్ణ యుగపు ఛాయలు కనుపిస్తాయి.

ఈ కవిత యొక్క లయ, అందం, కళాత్మకత ఉన్నతమైనవి. మిస్ట్రల్ ప్రకృతి నుండే దీనికి మూలాలను గ్రహించాడు. మనిషిని ప్రకృతిమాత బిడ్డగా భావించాడు. ఇతర కవులలాగ మిస్ట్రల్ మానవాత్మ జోలికిపోలేదు. ప్రథమ ముద్రణలోనే ఈ కవితకు మంచి స్పందన లభించింది. ''ఒక గొప్ప కవి జన్మించాడు'' అని లామర్టైన్ ప్రకటించాడు.

ఏడేళ్ళ తరువాత మిస్ట్రల్ 1867లో ''కేలెండు'' అనే రెండవ కృతిని వెలువరించాడు. అయితే ఈ కవిత యొక్క కథనం అద్భుతమైనా, అసాధ్యమని చెప్పబడింది. వర్ణనలలోను, ఆకర్షణలోను ఇది మొదటి కవితతో సమానమైనదిగా భావించబడింది. ఇది సముద్రాన్ని, అడవుల్ని అందంగా వర్ణిస్తుంది.

మిస్ట్రిల్ ఎపిక్ కవే కాదు, గేయ కవి కూడా. 1876లో ప్రచురింపబడిన ''ఐలండ్స్ ఆఫ్ గోల్డ్'' సంకలనంలో దివ్య సౌందర్యంతో కూడిన ఎన్నో గేయాలున్నాయి. ఇతరగేయాల్లో కవి తన మాతృదేశపు స్వతంత్రమైన ఉనికి, దాని హక్కులు రక్షింపబడాలంటాడు.

1884లో రచించిన కవిత ''నెర్టో'' మినీ కథారూపంలో వుంది. ఇందులో ఎన్నో అందమైన వర్ణనలున్నాయి. 67 సంవత్సరముల వయస్సులో రచించిన ''లో పోయెమొడో రోజ్'' అంతకంటే ఉన్నత రచన. నిజంగా ప్రార్థించాలంటే ప్రతి వొక్కడు ఒక నావికుడు కావాలంటాడు. ఇందులోని ''అపొ'' ఓడ కెప్టెన్ కూతురు 'అంగ్లోరా'. ఈమె పాత పురాణాలను ఔపోసన పట్టింది. ఒక రాత్రి నదీ దేవుడు 'లోద్రా' ను ఆమె చూసినట్లు భావించుకుంటుంది. ఆ దేవుడు ఆ వెన్నెల రాత్రి ఆమెను స్పృశించినట్లు భావించుకుంటుంది. ఈ కవి రచనలన్నీ తన జన్మ భూమి అయిన ప్రావిన్స్‌ను ఉన్నతీకరించినవే.

ఈ సంవత్సరం ఈ కవి జీవితంలో ముఖ్యమైనది. యాభైయేళ్ళ క్రితం మరో ఆరుగురు సాహితీ

మిత్రులతో కలిసి ''ప్రావిన్షియల్‌పొయెట్స్'' అసోసియేషన్ ప్రారంభించాడు. సెయింట్‌రెమీ నుండి ఆర్లేస్ వరకు, రోన్‌వాలీ ఆరంజ్‌నుండి మార్టిగ్స్ వరకు మాట్లాడే భాష క్రొత్తసాహితీ భాషగా గుర్తింపు పొందేందుకు ప్రయత్నించాడు. ఆ ప్రయత్నం సఫలమయింది. దీని ఫలితమే 1879-86 సంవత్సరాల మధ్య కాలంలో మిస్ట్రల్ క్రోడీకరించిన ''నియోప్రావిన్షియల్ డిక్షనరి''

మిస్ట్రల్ ఎన్నో గౌరవాలను, పురస్కారాలను అందుకున్నాడు. నాలుగు సార్లు ఫ్రెంచి అకాడెమి బహుమతి నందుకున్నాడు. ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్రాన్స్ రేనాడ్ పురస్కార పరంగా పదివేల ఫ్రాంకుల మొత్తాన్ని ఆయన నిఘంటు నిర్మాణ కృషికి గాను అందజేసింది. హాల్లె, బాన్ విశ్వ విద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశాయి. అతని కవితలెన్నో విదేశ భాషల్లోకి అనువదింప బడ్డాయి.

ప్రావిన్షియల్ కవులకు మిస్ట్రల్ ''ది సన్‌మేక్స్ మి సింగ్'' అనే మోటోను ఇచ్చాడు. ఆ కవితలు ప్రావిన్షియల్‌సూర్యరశ్మిని ఎన్నో దేశాలకు ప్రసరింపజేశాయి.

ఆల్ఫ్రెడ్ నోబెల్ తన పురస్కార గ్రహీత ఆదర్శవాది అయివుండాలని ప్రతిపాదించాడు. మిస్ట్రల్ కవిత్వంలో ఆరోగ్యకరమూ, శాశ్వతమూ అయిన ఆదర్శవాదం పుష్కలంగా వుంది. ఒక ఆదర్శం కోసం జీవితాన్ని అంకితం చేసుకున్న, తన దేశపు ఆధ్యాత్మికతను సుసంపన్నంచేసిన ఈ ఆదర్శవాది ఈ పురస్కారానికి అన్ని విధాలా అర్హుడు.

**జీవిత చరిత్ర**

ఫ్రెడరిక్ మిస్ట్రల్(1830-1914) ఒక ప్రాచీన భూఖామందుల కుటుంబంలో జన్మించాడు. అతని బాల్యంలో తండ్రి ప్రభావానికి గాఢంగా లోనైనాడు. లా చదివాడు. లా డిగ్రీ తీసుకున్నాక కవిత్వానికి అంకితమయ్యాడు. స్కూలు రోజుల్లో తనగురువైన జోసఫ్ రోమనిల్లె వల్ల ప్రభావితుడైనాడు. నియోప్రావిన్షియల్ భాషను సాహితీ భాషగా మలచడం అతని నిర్ణయం. అందుకోసం అతడు ఎన్నో సంవత్సరాలు శ్రమించి ఆభాషకు ఒక నిఘంటువును సమకూర్చాడు. దీనిని మిస్ట్రిల్ ప్రారంభించిన సాహితీ సంస్థ ప్రచురించింది.

మిస్ట్రల్ క్లాసిక్ కవేగాక, గేయ కవికూడా. అతని కవిత్వం ప్రావిన్స్‌తో ముడిపడి వుంది. ప్రావిన్స్ అతని కవిత్వపు కథానాయకుడు. అతడు 1859 లో ప్రచురించిన 'మిరెయో' మొదటి విజయవంతమైన గ్రంథం. 1867లో 'కేలెండ్'ను ప్రచురించాడు. ఇది ఒక ప్రావిన్షియల్ జాలరిని గురించిన కథాకథన కవిత.

అతని ఇతర రచనలు: '' ఐలండ్స్ ఆఫ్ గోల్డ్'' (1876), ''నెర్టో'' (1884); ''లారెనోజనో'' (1890); '' ది సాంగ్ ఆఫ్ రోన్ '' (1897); 1887-1910 ల మధ్య అతని కృతులు అయిదు సంకలనాలుగా వెలువడ్డాయి. 1926-30 ల మధ్య అతని తరువాతి రచనలు మూడు సంకలనాలుగా ప్రచురింపబడ్డాయి. 1906లో మిస్ట్రల్ ''మెమొరీస్ ఆఫ్ మిస్ట్రల్'' అనే మకుటంతో తన ఆత్మ కథను వ్రాసుకున్నాడు. ఫ్రెంచి అకాడెమి, ఫ్రెంచి ఇన్స్టిట్యూట్‌లు అతని కృషికి సాయపడ్డాయి.

# వలస

– వింజనంపాటి రాఘవరావు

''తిరిగే కాలూ, తిట్టే నోరూ ఊరుకోవట''

ఎక్కడా క్షణం నిలవకుండా తిరిగే వాళ్ళను, కాళ్ళలో చక్రాలున్నాయంటూ ఎగతాళి చేస్తాం.

జీవికి విశ్రాంతి, తనకు పిల్లలకు ఎండ వానల నుండి రక్షణ, ఇతర జంతువుల నుండి రక్షణ లభించే ప్రదేశం నివాసం. ఒకచోట స్థిరంగా నివాసం వుండకుండా తిరిగే వారిని సంచార జాతుల వారంటారు. వ్యవసాయం చేయటం నేర్చుకోక ముందు మానవులందరూ దాదాపుగా సంచార జీవులే. అయితే ప్రస్తుతం కొద్దిమంది మాత్రమే దేశాలు పట్టుకు తిరుగుతున్నారు. ఆర్యులు ఉత్తరార్ధగోళం నుంచి భారత దేశానికి వలస వచ్చారనేది చారిత్రిక కథనం. కొలంబస్ కనుగొన్న సముద్రమార్గం ద్వారా (బ్రిటిష్‌వాళ్ళు అమెరికాకు వలస వెళ్ళి, అక్కడ వలస రాజ్యాన్ని స్థాపించారు.

రాచరికం నుండి చైనాను విముక్తం చేయటానికి మావో, 'లాంగ్‌మార్చ్' పేరుతో సాధారణ జనాన్ని సైనికులుగా మార్చి 'వలస' తీసికెళ్ళాడు.

''చీరాల, పేరాల చిన్నిగ్రామంబుల
దోస మించక కొంపదీసె నెవడు?'' అంటూ తన గురించి చెప్పుకున్న 'ఆంధ్రరత్న', చీరాల, పేరాల వాసులు పన్నులు చెల్లించకుండా జనాన్ని పొలాల్లోకి వలస తీసికెళ్ళాడు.

ఎంత స్థిర నివాసం ఏర్పరచుకున్నా పనిచేసే చోటికి 'వలస' పోవటం ఈనాటికీ తప్పటం లేదు. బ్రతుకు తెరువు కోసం పల్లెల నుండి పట్టణాలకు, ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి, ఒక దేశం నుండి మరో దేశానికి వలస వెళ్ళటం మనకు తెలిసిందే.

మన ఇంటి చుట్టు ప్రక్కల నివసించే కాకులు, పిచ్చుకల వంటివి తిండి వెతుక్కుంటూ వెళ్ళటం మనకు తెలుసు. ప్రతిరోజూ స్థిరనివాసం నుండి తిండి దొరికే చోటుకు వెళ్ళటం 'వలస' అనిపించుకోదు. అలాగే శాశ్వతంగా క్రొత్త ప్రదేశానికి వెళ్ళటాన్ని 'దేశాంతరం వెళ్ళటం', 'ఇమ్మిగ్రేషన్' (Immigration) అంటారు. జరాసంధుడి ధాటికి తట్టుకోలేక కృష్ణుడు మధుర నుంచి ద్వారకకు వెళ్ళటం ఇమ్మిగ్రేషనే.

వలస పోవటం, ఇమ్మిగ్రేషన్ వంటివి మానవ సమాజంలోనే కాక ఇతర జీవజాతుల్లోనూ వుంది. కొన్ని రకాల పక్షులు కొన్ని ఋతువులలో మాత్రమే కన్పిస్తాయి. తర్వాత మాయమై పోతాయి. ఈ విషయాన్ని 2000 సంవత్సరాలకు పూర్వమే అరిస్టాటిల్ కనుగొన్నాడు. అలాగే సేక్రెడ్ బుక్ ఆఫ్ ఈస్ట్ (Sacred Book of East) అనే సంస్కృత గ్రంథంలోనూ, బైబిల్ పాత నిబంధన గ్రంథం (Old Testment) లోను, హోమర్ (Homer) రచనలలోను వలస పక్షుల గురించిన సమాచారం వుంది.

---

వింజనంపాటి రాఘవరావు, జంతుశాస్త్రోపన్యాసకుడు, ఆం.ప్ర.గు. జూనియర్ కళాశాల,
పోలీసుబ్యారెక్స్, హిందూపురం, అనంతపురం జిల్లా - 515 202.

ఋతువులను బట్టి ఒక ప్రదేశంలో లభించే ఆహారం ఎక్కువ తక్కువలకు లోనవుతూ వుంటే ఆహారం ఎక్కువగా లభించే చోటికి జీవులు వలస వెళతాయి. అలాగే తమ సంతానాన్ని శత్రువుల బారినుండి రక్షించుకోవటానికి, వాటికి సరైన ఆహారం అందించటానికి కూడా జీవులకు వలస పోవటం తప్పనిసరి. జీవులకు మరో ప్రధాన అవసరం నీరు. వర్షాకాలం, శీతాకాలం నీటి అవసరం తక్కువ, వేసవి కాలంలో నీటి వనరులు తగ్గిపోతాయి. నీటిని వెతుక్కుంటూ వెళ్ళటం తప్పనిసరి.

వాతావరణంలో వచ్చే ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవటానికి జీవులు రకరకాల పద్ధతులు అవలంభిస్తాయి. అమీబా వంటి నిమ్నస్థాయి జీవులు తమ చుట్టూ కోశాన్ని నిర్మించుకుంటాయి. కొన్ని కీటకాలు గ్రుడ్లుపెట్టి చనిపోతాయి. అనుకూల పరిస్థితులలో గ్రుడ్ల నుండి పిల్లలు బయటకువస్తాయి. యూగ్లినావంటి జీవులు తమచుట్టూ శ్లేష్మంతో ఓ కోశాన్ని నిర్మించుకుంటాయి. కప్పలు, ఊపిరితిత్తి చేపలూ తమనితాము మట్టిలోపూడ్చి పెట్టుకుని నిద్రిస్తాయి. మంచు ఎలుగుబంటి ఒక గుహ త్రవ్వుకుని దానిలో నిద్రిస్తుంది. పక్షులు వీటన్నింటికీ భిన్నంగా సుదూర ప్రాంతాలకు వలసపోతాయి.

నిమ్నస్థాయి జీవులలో వలస అనేది కనపడకపోయినా, అన్నిజంతువులూ ఒకేచోట గుమిగూడకుండా విస్తరించటం కన్పిస్తుంది. ఉదాహరణకు సాలీళ్ళు, కొన్నిరకాల పేలు, మైట్స్, 5000 మీటర్ల ఎత్తులో కూడా కన్పిస్తాయి. ఇవి గాలి ప్రవాహంతో పాటు పైకెగిరి దూర ప్రదేశాలకు చేరతాయి. అయితే వాటి ప్రయాణం వాటి ఇష్టంపైకాక గాలి దిశను బట్టి జరుగుతుంది.

వుల్ఫ్‌స్పైడర్ (Wolf spider) అనే సాలీడు పిల్లలు కోశం నుండి బయటకు రాగానే ఓ రాతిపైకో, గడ్డిపరకపైకో ఎక్కి పొట్టను ఆకాశంవైపు త్రిప్పి, తమ ఉదరగ్రంథి నుండి సన్నని దారాన్ని విడుదల చేస్తాయి. ఈ దారం పేరాచూట్ లాగా పనిచేసి సాలీడును దూరంగా తీసికెళుతుంది.

ఫ్లోరిడాలో కోరల్ పర్వతాలలో నివసించే రొయ్యజాతి స్పైనీలోబ్‌స్టర్‌లు (Spinylobster) తుఫానుల తాకిడి నుండి తప్పించుకోవటానికి వలస పోతాయి. ఒకదాని వెనుక ఒకటి అంటిపెట్టుకుని సముద్రపు అడుగున గంటకు పావుకిలోమీటరు వేగంతో నడుస్తూ ప్రయాణించి 80 కిలోమీటర్ల దూరంలో వున్న 'గ్రేట్ బహామా బేంక్' అనే ప్రదేశానికి చేరతాయి. అనుకూల పరిస్థితులు ఏర్పడి ఆహారం సమృద్ధిగా దొరికే సమయానికి తిరిగి ఫ్లోరిడా వస్తాయి.

హిందూ మహాసముద్రంలో జావాద్వీపానికి దక్షిణాన 300 కిలోమీటర్ల దూరంలో వున్న క్రిస్టియన్ ద్వీపంలో అరణ్యంలో వుండే ఎర్రనేల పీతలు (Redland Crabs) లక్షల సంఖ్యలో సముద్రపు ఒడ్డున చేరతాయి. సముద్రపు ఒడ్డున సంపర్కం తర్వాత ఆడపీత వేల సంఖ్యలో గ్రుడ్లను సముద్రంలో వదులుతుంది. అరణ్యం నుంచి సముద్రానికి ప్రయాణంలో వేల సంఖ్యలో పీతలు తమ ప్రాణాలు కోల్పోతాయి. ఇరవై ఐదు రోజుల తర్వాత క్రొత్త పీతలు నేల మీద అడుగుపెడతాయి.

గోదురు కప్పలు ప్రధానంగా నేలపై నివసించినప్పటికీ, గ్రుడ్లు పెట్టటానికి అవి నీటిలోకి

వెళ్ళాల్సిందే. మిగిలిన సమయం ఎక్కడ గడిపినా గ్రుడ్లుపెట్టే సమయానికి అవి ఒకే నీటికుంటను లేదా చెరువును చేరతాయని పరిశోధన్లో తేలింది.

మూడు చేపల కథ మీ కందరికీ గుర్తుండే వుంటుంది. దీర్ఘదర్శి నీటికుంట ఎండిపోకముందే కాలువల ద్వారా పెద్ద చెరువులోకి వెళ్ళిపోతాడు. అచ్చం ఇలాగే యూరోపియన్-ఈవ్, అమెరికన్-ఈల్ అనే చేపలు మంచినీటి సరస్సుల నుండి బయలుదేరి, అట్లాంటిక్ మహాసముద్రంలోని సర్గాసో సముద్రానికి చేరతాయి (Sargasso Sea). అక్కడ గ్రుడ్లు పెట్టే కార్యక్రమం పూర్తికాగానే ప్రౌఢ జీవులు చనిపోతాయి. గ్రుడ్ల నుండి బయటకు వచ్చిన పిల్లలు తమ తల్లిదండ్రుల నివాసమైన మంచినీటి సరస్సులకు బయలు దేరతాయి. దీనికి సంవత్సరం నుండి పద్దెనిమిది నెలల కాలం పట్టవచ్చు. ఈ విధంగా మంచినీటి నుండి గ్రుడ్లు పెట్టటానికి సముద్రాలలోకి చేపల ప్రయాణాన్ని 'కెటాడ్రామస్' వలస (Catadramous Migration) అంటారు.

దీనికి భిన్నంగా సాల్మన్ చేపలు, హిల్సా అనే గంగ, గోదావరి నదుల్లోని చేపలు సముద్రం నుండి తమ జన్మస్థానమైన మంచినీటిలోకి ప్రయాణిస్తాయి. అక్కడ లోతు తక్కువ గుంటల్లో గ్రుడ్లుపెట్టి మరణిస్తాయి. వీటి ప్రయాణం 3000 కిలోమీటర్లుపైనే ఉంటుంది. ఈ వలసను ' ఎనాడ్రామస్' వలస (Anadramous Migration) అంటారు.

చేపలు పరిసరాల వాసనను బట్టి ప్రయాణిస్తాయని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. అయితే అంతకు ముందెన్నడూ చూడని సుదూర ప్రాంతాలకు చేపలు ఎలా ప్రయాణిస్తాయన్న సంగతి ఈనాటికీ ఇదమిద్ధంగా తెలీదు.

చేపల వలస మార్గాన్ని ఉపగ్రహంద్వారా గుర్తించి, ఆ సమాచారాన్ని రేడియోద్వారా మత్స్యకారులకు తెలపటం వలన ఎక్కువ చేపలను పట్టటం సాధ్యమౌతుంది. పాశ్చాత్య దేశాలలో ఎప్పటి నుండో వ్యాప్తిలో ఉన్న ఈ విధానం మన దేశంలోనూ ఇప్పుడిప్పుడే వ్యాప్తిలోకి వస్తోంది.

సముద్రంలో నివసించే ఆకుపచ్చ తాబేళ్ళు రెండు మూడేళ్ళకోసారి బ్రెజిల్ తీరం నుండి రెండువేల కిలోమీటర్లు ప్రయాణించి, దక్షిణ అట్లాంటిక్ సముద్రంలోని ఎసన్షియన్ (Ascension) ద్వీపానికి చేరతాయి. రోజుకు 50 కిలోమీటర్ల వంతున ఈ ప్రయాణానికి వాటికి సుమారు ఎనిమిది వారాలు పడుతుంది. ఆడ తాబేళ్ళు పొడిగావుండే ఇసుకలో గుంటచేసి గ్రుడ్లుపెట్టి మరలా సుదీర్ఘ ప్రయాణాన్ని సాగిస్తాయి. నూట ఇరవై మిలియన్ సంవత్సరాల క్రితం ఆఫ్రికా, అమెరికా ఖండాలు దూరంగా జరగటం వలన అట్లాంటిక్ మహాసముద్రం ఏర్పడింది. తాబేళ్ళు గ్రుడ్లుపెట్టే దీవులన్నీ అట్లాంటిక్లో మునిగిపోగా ఎసన్షియక్ ద్వీపం మాత్రం మిగిలి, తాబేళ్ళు సంతతి వృద్ధి చేసుకోవటాకి తోడ్పడుతోంది.

మనం ఎన్ని జీవుల గురించి చెప్పుకున్నా వలస విషయంలో పక్షులే అగ్ర 'గాములు'. గాలిలో ప్రయాణించగలిగే శక్తివలన అవి ఏ విధమైన భౌతిక అడ్డంకులనూ లెక్కచేయవు. పక్షులు ఉత్తరం నుండి దక్షిణానికి, తూర్పునుండి పడమరకు పర్వత శిఖరాల నుండి మైదానాలకు, ఏకాంతరంగా (Altermataly) వలస పోతుంటాయి. కొన్ని గుంపులుగా వలసపోతే, కొన్ని ఒంటరిగా వెళతాయి.

వలసపోయే పక్షుల్లో అతి ఎక్కువ దూరం ప్రయాణించే 'ఛాంపియన్' ' ఆర్కిటిక్ టర్న్' (Arctic Tern) పావురం పరిమాణంలో వుండే ఆర్కిటిక్‌టర్న్ ఎండాకాలంలో మంచులేని 'లాబ్రడార్' తీరంలో, ఆర్కిటిక్ వలయంలో చాలాలోపల గూడుకట్టి, పిల్లలను పెంచుతుంది. ఆర్కిటిక్‌లో శీతాకాలం ఆరంభమవగానే ఇది పదకొండువేల కిలోమీటర్లు ప్రయాణించి అంటార్కిటాకు చేరుతుంది. మరలా ఎండాకాలంలో ఇంతదూరం ప్రయాణించి ఆర్కిటిక్ చేరుతుంది. యూరోపియన్ వైటిస్టార్క్ అనేకొంగజాతి పక్షిఎనిమిదివేల కిలోమీటర్లు ప్రయాణించి శీతాకాలం దక్షిణాఫ్రికాలో గడుపుతుంది.

పక్షుల్లో అతిపెద్దరెక్కలు కలిగిన అల్‌బెట్రోస్ (Albatros) ట్రిస్టన్ - డి- కన్హా అనే ద్వీపం నుండి అట్లాంటిక్ సముద్రంలో తెలియని ప్రదేశానికి వలస వెళతాయి.

జపాన్‌లోను, తూర్పు సైబీరియాలో గూడుకట్టే నీడిల్‌టైల్ స్విఫ్ట్ (Neadle tail swift) అనే పక్షి పదివేల కిలోమీటర్లు ప్రయాణించి ఆస్ట్రేలియా, టాస్మానియాలలో శీతాకాలం గడిపేస్తుంది.

బూబిలింక్స్ అనేపక్షి దక్షిణ అమెరికా ఈశాన్య ప్రాంతవాసి. ఎనిమిదివేల కిలోమీటర్లు ప్రయాణించి బ్రెజిల్, ఉత్తర అమెరికాలకు వలసపోతుంది.

ఇక మన దేశానికి వలసవచ్చే సైబీరియా కొంగలు, స్టార్క్‌లు, హెరాన్స్ వంటి ఇతర పక్షుల కోసం ప్రత్యేకమైన శరణాలయాలు ఏర్పాటుచేయటం మనకు తెలిసిందే. అనంతపురం జిల్లా లేపాక్షి మండలంలోని వీరాపురం అటువంటి శరణాలయాల్లో ఒకటి.

గూడువిడచిన కొద్ది గంటల్లోనే, యూరప్ స్విఫ్ట్ (Swift) అనేపక్షి ఈశాన్య ఆఫ్రికాకు ప్రయాణమౌతుంది. ఆ తొమ్మిదివేల ఆరువందల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కూడా అది నేలమీద వాలకుండా, గాలిలోనే ఆహారాన్ని పట్టుకుతిని, ఎగురుతూనే నిద్రపోతుంది. మరలా యూరప్‌వచ్చి గూడు కట్టటానికి నేలమీద దిగటానికి మధ్య ఇరవైరెండు నెలలకాలం గడిచిపోతుంది.

పక్షుల వలస గురించిన వింతలు విశేషాలు ఎలా వున్నా అవి ఖచ్చితంగా ప్రతి సంవత్సరం, దాదాపుగా ఒకేరోజు ఒకే చోటికి ఎలా చేరతాయి? వాటికి ఇన్నివేలకిలోమీటర్లు ప్రయాణించటానికి శక్తి ఎలా వస్తుంది? వంటి ప్రశ్నలకు సమాధానాలు చూద్దాం.

వలస వెళ్ళటానికి ముందు జీవి శరీరకంగా తయారు కావాలి. శరీరంలో క్రొవ్వు నిల్వలు ఎక్కువౌతాయి. ఆహారం క్రొవ్వురూపంలో నిల్వ వుండటం వలన ప్రయాణంలో అది ఇంధనంగా పనిచేస్తుంది. అంతేగాక ఒకగ్రాముగ్లైకోజన్‌ను విడగొట్టినప్పుడు వచ్చేశక్తి కంటే ఒకగ్రాము క్రొవ్వు ఎక్కువ శక్తినిస్తుంది. ఈ విడగొట్టటంలో విడుదలయ్యే నీటిని కూడా జీవి వుపయోగించుకుంటుంది.

అలాగేచాలా వరకు పక్షులు రెక్కలు ఆడించటం ద్వారా ఎగరకుండా, రెక్కలుసాచిగాలి ప్రవాహాన్ని ఆధారం చేసుకునిగ్లైడింగ్ (Gliding) చేయటం ద్వారా ప్రయాణిస్తాయి.

కొన్ని పక్షులు ధృవ నక్షత్రాన్ని ఆధారం చేసుకుని ప్రయాణిస్తే, మరికొన్ని సూర్యుని గమనాన్ని ఆధారం చేసుకుంటాయి. ఆకాశం మేఘావృతమైవున్నా, అల్ట్రావయొలెట్ కాంతిని పక్షులు

గ్రహించగలవు. ప్రతి గంటకు పదిహేను డిగ్రీలు చొప్పున మార్గాన్ని మార్చుకుని ప్రయాణిస్తాయి. ఈ పదిహేను డిగ్రీలు భూభ్రమణానికి సమానం.

భూ అయస్కాంత క్షేత్రాన్ని ఆధారం చేసుకొని వలస వెళ్ళేపక్షులు, వేర్వేరు ప్రదేశాల్లో భూ అయస్కాంత క్షేత్రంలో వచ్చే మార్పులను కూడా గుర్తించి ప్రయాణ మార్గాన్ని నిర్ణయించుకుంటాయి. వలసవెళ్ళే పక్షుల మెదడులో 'మాగ్నటైట్' (Magnatite) అనే అయస్కాంత ఖనిజాన్ని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బహుశః ఈ ఖనిజం భూ అయస్కాంత ప్రభావాన్ని తెలియజేస్తుండవచ్చు. అయితే పుట్టిన తర్వాత మొదటిసారి ఎవరి సాయం లేకుండా వలస వెళ్ళే పక్షులు తమ తల్లిదండ్రులు వెళ్ళే ప్రదేశానికి ఎలా చేరతాయో ఇంకా అంతుచిక్కని రహస్యంగానే వుండిపోయింది.

ఇక వేగం విషయానికొస్తే పసిఫిక్ గోల్డెన్ ప్లోవర్ అనే 150 గ్రాముల బరువుండే పక్షి 18 గ్రాముల క్రొవ్వును వుపయోగించుకొని గంటకు వంద కిలోమీటర్ల వేగంతో 37 గంటల్లో సుమారు మూడువేల ఎనిమిది వందల కిలోమీటర్లు, ఎక్కడా ఆగకుండా ప్రయాణిస్తుంది. ఇదే ఆగకుండా చేసే ప్రయాణంలో ప్రపంచ రికార్డు.

మూడున్నర గ్రాముల బరువుండే 'హమ్మింగ్ బర్డ్' (Humming Bird) గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో మెక్సికో అఖాతాన్ని పదిగంటల్లో దాటుతుంది.

భారతదేశపు 'స్విఫ్ట్' పక్షులు గంటకు 200 మైళ్ళ వేగంతో ఎగిరినట్లు E.C. స్టువార్ట్ అనే శాస్త్రవేత్త కనుగొన్నాడు.

''నల్లని మబ్బులు గుంపులు గుంపులు
తెల్లని కొంగలు బారులు బారులు'' అంటూ నల్లని పరదావంటి మబ్బులపై కొంగల అందాన్ని వర్ణించాడో సినీకవి. కొంగల బారుల్ని అందరూ చూసే వుంటారు. కొంగలు ఎప్పుడూ ఇంగ్లీషు 'వి' (V) ఆకారంలోనే ఎగురుతూ పోతుంటాయి. దీనికి కారణం ఏమిటి? కొంగల బారుకు ముందుండే పక్షి రెక్కలు ఆడించటం వలన గాలిలో ఏర్పడే చిన్న అలలు వెనుకకు వ్యాపిస్తాయి. ఈ అలలు వెనుక వుండే పక్షి ఎక్కువగా రెక్కలు ఆడించకుండానే ముందుకు కదిలే అవకాశం కల్పిస్తాయి. ఈ 'వి' ఆకారంలో ప్రయాణించటం వలన పక్షులు తక్కువ 'శక్తి'తో ఎక్కువ దూరం ప్రయాణించ గలుగుతాయి.

ఇక వలస పోయే క్షీరదాల విషయానికొస్తే కారిబౌ (Caribou) జింకలనే చెప్పుకోవాలి. యూరప్‌లోని రెన్‌డీర్ (Reindeer) దగ్గరి బంధువు అయిన కారిబౌ ఉత్తర అమెరికా ఆర్కిటిక్ ప్రాంతానికిచెందినది. శీతాకాలంలో ఇవి కెనడా, అలస్కాలోని 'కోనిఫర్' అరణ్యాలకు చేరుకుంటాయి. ఒక్కొక్క వలస పోయే మందలో కొన్నివేల జింకలుండి, వాటివరస 250 కిలోమీటర్ల వరకు వుంటుంది. సంవత్సరానికి రెండుసార్లు ఇవి ఒకే మార్గంలో ప్రయాణించటం వలన ఆర్కిటిక్ ప్రాంతంలోని రాళ్ళు కనీసం రెండు అడుగుల (2') మేర అరిగిపోయి వుంటాయని ఒక అంచనా.

కెన్యాలోని మసైమరా (Masai Mara) రిజర్వులో నివసించే జీబ్రాలు, గజెల్ జింకలు రెండువందల కిలోమీటర్లు ప్రయాణించి టాంజానియాలోని సెరంగటి ప్రాంతానికి చేరతాయి. మధ్యదారిలో ఏటా నలభైవేలకు పైగా ఈ జింకలు సింహాలు, తోడేళ్ళ బారిన పడతాయి. అయినప్పటికీ టాంజానియాలో పెరిగే గడ్డిలో వుండే ఫాస్పరస్ పిల్లల ఎముకల గట్టితనానికి తోడ్పడుతుంది. అందుకే ఇంత ప్రమాదకరమైన ప్రయాణం.

బూడిద రంగు తిమింగలాలు సంవత్సరంలో ఆరు నెలల కాలం వలస ప్రయాణంలోనే గడుపుతాయి. ఆర్కిటిక్ నుండి మెక్సికో దగ్గరి బజా కాలిఫోర్నియా సముద్రంలో పిల్లలను కనటానికి చేరతాయి. ఈ (20,000) ఇరవై వేల కిలోమీటర్ల ప్రయాణానికి వాటికి మూడు నెలలు పడుతుంది.

హంప్‌బేక్ (Hump Back) తిమింగలాలు శీతాకాలంలో ఉష్ణమండల సముద్రంలో పిల్లలనుకని, ఎండాకాలం నాటికి శీతల మండలానికి చేరతాయి. అవి సుమారుగా ఆరువేల నాలుగు వందల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. వాటి శరీరంలో మాగ్నటైట్ అనే అయస్కాంత పదార్థం లభించటం వలన, తిమింగలాలు కూడా భూ అయస్కాంతాన్ని ఆధారం చేసుకుని ప్రయాణిస్తాయని శాస్త్రవేత్తల భావన.

అన్నిటికంటే తెలివైన, వయసులో పెద్దదైన అమ్మమ్మ ఏనుగు, ఏనుగులమందను నీటివద్దకు, ఎక్కువ ఆహారం లభించేచోటికి తీసుకెళుతుంది. ఆఫ్రికాలో ఏనుగులు తిరిగే ప్రదేశం 750 నుండి 1650 చదరపు కిలోమీటర్లు వరకు వుంటుంది. నీటి కోసం ఏనుగులు ఒక్కోసారి 30 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తాయి. ఏనుగులు ప్రయాణించే మార్గాన్ని 'ఏనుగుల రహదారి' (Elephand Road)గా వర్ణిస్తారు.

అతి సుకుమారమైన రెక్కలుగల సీతాకోక చిలుకలు ఎంతదూరం ప్రయాణించగలవు? ఊహించండి. దక్షిణ కెనడా, ఉత్తర అమెరికా సంయుక్త రాష్ట్రాలలో నివసించే, పదిసెంటీమీటర్ల పొడవుండే మొనార్క్ సీతాకోక చిలుక (Monarch Butterfly) రెండు వేలనుండి, మూడు వేల కిలోమీటర్లు ప్రయాణించి కాలిఫోర్నియా, మెక్సికోలకు చేరి గ్రుడ్లుపెట్టి చనిపోతాయి. వాటి పిల్లలు బయటకు రాగానే మరలా ప్రయాణం మొదలెడతాయి.

అంతా చదివారు కదా! ఇంతకీ వలస ఎందుకు?

ఆహారం కోసం,
పిల్లలను కనటంకోసం,
పుట్టిల్లు చూడటం కోసం,
శత్రువుల నుండి పిల్లల్ని రక్షించుకోవటంకోసం,
అతివేడి, అతిశీతలాల నుండి తప్పించుకోవటంకోసం
ఇంకా మనకు తెలీని కారణాలున్నాయేమో!

(ఆకాశవాణి అనంతపురం కేంద్రం ద్వారా ప్రసారం చేయబడినది)

# చిత్రకళా దిగ్గజం - అహివాసి

- కాండ్రేగుల నాగేశ్వరరావు

జగన్నాథ మురళీధర్ అహివాసి. ఇందులో జగన్నాథ తనపేరు, మురళీధర్ తండ్రి పేరు, అహివాసి ఇంటి పేరు. జులై 6వ తేదీన 1901 సం॥లో గోకుల మధురలో జన్మించాడు. తండ్రి పోర్ బందర్ నివాసయిన ఉత్తరహిందుస్థానీ సంగీత ఉస్తాద్ మురళీధర్. పోర్ బందరులోని ద్రుపద్ దుమార్‌సంస్థానపు ఆస్థాన గాయకుడాయన. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకొన్న జగన్నాథుని కంటికి రెప్పలా చూసుకుంటూ పెద్ద ప్రభుత్వ అధికారిగా చూడాలనుకున్న తన తండ్రి కాంక్షను కాదని చిత్రకారుడయినాడు. మల్‌దీవ్‌రానా అని పిలువబడే సృజనాత్మక చిత్రకారుడతని మొదటి గురువు.

స్కూలు జీవితం పూర్తయిన వెంటనే బొంబాయి చేరుకొని అక్కడ కొట్కర్ ఇన్స్టిట్యూట్‌లో చిత్రకళా విద్యార్థిగా ప్రవేశం సంపాదించి మరొక ప్రక్క అదే సమయంలో జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో విద్యనభ్యసించాడు. జె.జె.స్కూలులో కొట్కర్ ప్రోద్భలంతో రెండు సంవత్సరాల కోర్సును పూర్తి చేయకుండానే పై తరగతులకు ప్రమోట్ చేయబడ్డాడు. 1926 సంవత్సరంలో కాలేజీలో ప్రథమునిగా ఉత్తీర్ణుడయినాడు. ఆ తరువాత ఆయన చిత్రకళలో చూపిన నిరుపమానమైన శైలి అతనికేగాక అతను విద్యనభ్యసించిన జె. జె. స్కూలుకు కూడా ఎనలేని ఖ్యాతిని తెచ్చిపెట్టింది.

అహివాసి విదేశీ సంప్రదాయపు రీతిలో చిత్రకళను అభ్యసించి, ప్రాశ్చాత్య చిత్రకళా పోకడలను పూర్తిగా జీర్ణించుకొని, మరొక ప్రక్క భారతీయ చిత్రకళా అస్తిత్వాన్ని నిలుపుతూ, తన దైన ఒక శైలిలో చిత్రకలకు ఎనలేని శోభను చేకూర్చాడు. పరస్పర విరుద్ధమయిన రెండు భిన్న రీతులు, సంప్రదాయలనూ సమన్వయ పరుస్తూ ఆయన చేసిన కృషి అజరామరమయినది. భారతీయులనే కాక పాశ్చాత్యులను సయితం సమ్మోహన పరచిన కళాజీవి ఆయన. బొగ్గుతో కాగితంపై గీసిన ఎల్లోరా, అజంతా శిల్పాలు ఆయన రేఖలలో ప్రత్యేక తేజస్సు పొంది కనులకు విందు చేస్తాయి. స్వర్ణ పతకాలు సాధించటం అతనికి సామాన్య విషయంగా మారింది. ఖండాతర ఖ్యాతి అలవోకగా వచ్చి పడింది. అతని చిత్రాలను కొని భద్రపరచుకొన్న వారిలో ఇంగ్లండు రాణి, పాటియాల మహారాజు లాంటి ఎందరో ప్రముఖులున్నారు.

భారత దేశపు రాష్ట్రపతి భవనము, పార్లమెంట్ హౌస్, ఉత్తరప్రదేశ్ విధాన సభల్లో ఆయన వేసిన కుడ్య చిత్రాలు కొలువుతీరి ఉన్నాయి. (పార్లమెంట్ హౌస్‌లో కుడ్య చిత్రాలు వేయడానికి ఎన్నికయినవారిలో ఆంధ్రుడయిన కీ॥శే॥ దామెర్ల రామారావు కూడా ఉన్నారు. కానీ ఢిల్లీ ప్రయాణానికి కొన్ని రోజులు ముందు ఆయన ఆకస్మికంగా మరణించారు.)

'మీరా నిష్క్రమణ' అన్న ఆయన చిత్రం UNESCO ఆధ్వర్యంలో జరిగిన చిత్ర కళా ప్రదర్శనలో ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచింది. చైనా ప్రభుత్వం తరుపున చే.ఎన్.లై కు బహుమతిగా ఇవ్వబడింది.

బొంబాయిలోని రాయల్ అకాడమీ ఆఫ్ ఆర్ట్ ప్రిన్సిపాలయిన గ్లాడ్ స్టోన్ నార్మల్‌కు అహివాసి

---

కాండ్రేగుల నాగేశ్వరరావు, హైదరాబాదు, కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో అడిషనల్ కమీషనర్‌గా పదవీ విరమణ చేశారు. కళా సాహిత్యాలు అభిమాన విషయాలు.

చిత్రాలంటే మితిమీరిన మెప్పుకోలు. ఏ జె. జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్ బొంబాయిలో విద్యనభ్యసించాడో అదే స్కూలుకు అతను ప్రిన్సిపాల్‌గా నియమితుడయినాడు. 1956వ సంవత్సరంలో రిటైరయినాడు. ఆ తరువాత బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో మొట్టమొదటి చిత్రకళా విభాగానికి ప్రధాన అధ్యక్షుడయినాడు. ఆయన కాలంలోనే డిప్లమోగా ఉన్న చిత్రకళను డిగ్రీకి, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయికీ, రిసర్చి వరకూ తీసుకొని వెళ్ళబడింది.

అహివాసి అనేక సార్లు అజంతా, ఎల్లోరా, బేలూరు, ఎలిఫెంటా, బదామి మొదలైన ప్రదేశాలకు వెళ్ళి అందులోని కుడ్య చిత్రాలకు నకళ్ళు వేసుకొన్నాడు. అతని ప్రతిభను గమనించిన లలిత కళా అకాడమీ వారు అతనిని బదామి, సిత్తనవాసల్‌లోని కుడ్య చిత్రాలకు ప్రతీకలు చేయవలసినదిగా నియమించి, 1956వ సంవత్సరంలో బంగారు పతకాన్ని బహూకరించారు.

అహివాసి చిత్రకారుడే కాదు, సాహిత్యాభిలాషి, మంచి గాయకుడు కూడా, గోకుల మధురలో జన్మించటం వలన కావచ్చు జీవితాంతం కృష్ణ భక్తునిగా ఉండి పోయాడు.

అహివాసి మహాభారతంలో ద్రోణుడు లాంటివాడు. అనేక పేరు మోసిన భారతీయ చిత్రకారులు ఆయనను కలసి శిక్షణ పొందిన వారే. వారిలో శ్రీపాద, మాధవ సత్వల్‌కార్, కె.కె. హెబ్బార్ నుంచి తెలుగు వాడయిన పి. టి.రెడ్డి ( అహివాసి నా గురువు పి. టి.రెడ్డి ఆత్మకథ నుంచి) లాంటి ఎందరో అతిరథులు, మహారథులూవున్నారు.

రేఖలను పొందికగా వాడటం ఆయన తీసుకొని వచ్చిన కొత్తశైలి. ఆంధ్రుల అభిమాన చిత్రకారుడయిన బాపూ రేఖలలో ఇలాంటి సోయగాన్ని చూడవచ్చు. దామెర్ల రామారావులానే అహివాసి రంగుల చిత్రాలలో ప్రీరాఫాలైట్ ధోరణి కనిపిస్తుంది. ఆయన బొగ్గుతో వేసిన రేఖా చిత్రాలు రేఖాంజలిగా పుస్తక రూపంలో ప్రచురిత మయినవి. ఆయన వేసిన రంగుల చిత్రాలు సరియైన విధంగా అచ్చుకాక పోవటము వలన రంగులు తమ స్పష్టతను కోల్పోయి ఉంటాయి. తిరిగి వాటిని ప్రచురించవలసిన అవసరం ఎంతయినా ఉంది. భారతీయతను అణువణువునా నింపుకొన్న సంపూర్ణ చిత్రకారుడు అహివాసి.

## LITERARY ANECDOTES

### THOMAS FLATMAN (1637-88)

THIS person.... Was in his younger days much against marriage, to the dislike of his father, and made a song describing the cumbrances of it, beginning thus:

Like a dog with a bottle tied close to his tail,
Like a tory in a bog, or a thief in a jail, etc.

But being afterwards smitten with a fair virgin, and more with her fortune, he did espouse her 26 November 1672; whereupon his ingenious comrades did serenade him that night, while he was in the embraces of his mistress, with the said song.

# మైఖేల్ మధుసూదనదత్ - గురజాడ

- డా॥ యు.ఎ. నరసింహమూర్తి

''కొయ్య బొమ్మలు మెచ్చుకళ్లకు

కోమలుల సౌరెక్కునా'' - అంటూ సంప్రదాయ వాదుల మీద బహిరంగంగా తిరస్కార భావాన్ని ప్రదర్శించిన గురజాడకు, మైఖేల్ మధుసూదన్ దత్తుకు కొన్ని పోలికలు కనిపిస్తాయి. సంప్రదాయ నిరాకరణము, సంప్రదాయ లక్షణ పునర్వ్యాఖ్యానం - అనే పరస్పర విరుద్ధములైన రెండు చోదక శక్తులు మైఖేల్ మధుసూదనదత్తులో బలమైన సృజన శక్తులుగా మోహరించి బెంగాల్ పునర్వికాసానికే కాక ఆధునిక భారతావతరణంలో కూడా పాలు పంచుకున్నాయి. "He remade himself as the first modern Bengali, and Indian, Poet of time importance".[1] ఆధునిక భారతీయ సాహిత్యానికి మైఖేల్ మధుసూదనదత్తు నాందీవాక్యం పలికినట్లుగానే ఆధునిక ఆంధ్ర సాహిత్యానికి గురజాడ అంకురార్పణం చేసాడు. అందుకే ఆధునికాంధ్రులు ''అడుగుజాడ గురజాడది'' అని కీర్తించారు. ''కొత్త పాతల మేలు కలయిక'' నాశించడంలో గురజాడకు సంప్రదాయ నిరసన పట్ల మాత్రమే కాక, సంప్రదాయ పునర్వ్యాఖ్యానం పట్ల కూడా కొంత ఆసక్తి ఉందని ఊహించవచ్చును. ''రవణరాజుకల'', ''సుభద్ర'' వంటి రచనలు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తాయి.

మైఖేల్ మధుసూదన దత్తు కలకత్తాలోని హిందూ కళాశాలలోను, బిషప్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసాడు. గురజాడ ఆ రోజుల్లో హిందూ కళాశాలకు దీటుగా నిలచిన విజయనగరం మహారాజా కళాశాలలో విద్యాభ్యాసం చేసాడు. ఇద్దరూ ఆంగ్ల విద్యా సంపన్నులయారు, లభ్యమైన పాశ్చాత్య సాహిత్యాన్ని విస్తృతంగా, గాఢంగా అధ్యయనం చేసారు. దత్తుకు ఆంగ్లంతో పాటు హిబ్రూ, ఫ్రెంచి, పర్షియన్, తెలుగు, తమిళ భాషలలో మంచి పరిచయం, ప్రవేశం ఉన్నాయి. దత్తు తండ్రి ప్రముఖ న్యాయవాది అయిన కారణంగా వారి కుటుంబానికి పారశీక భాషతో మంచి పరిచయం ఏర్పడింది. హిందూ కళాశాలలో విద్యార్థిగా ఉండే రోజుల్లో దత్తు పర్షియన్ గజళ్లు రాసి పాడేవాడు. గురజాడ బహుభాషా పండితుడు కాకపోయినా ఆంగ్లంతో పాటు తెలుగు, సంస్కృత భాషలలో పండితుడు. బెంగాలీ తెలిసిన ఆనంద గజపతి మహారాజు సాన్నిహిత్యం కారణంగా అతనికి బెంగాలీ భాషతో కూడా కొంచెం ముఖమెరుక ఉంది. ఆ రోజుల్లో విజయనగర సంస్థానంలో పర్షియన్ పండితులు ఉండేవారు. సంస్థానం ఒక పర్షియన్ భాషా నిఘంటువును కూడా ప్రచురించింది. ఆకారణంగా గురజాడకు పర్షియన్‌తో ప్రత్యక్షపరిచయం లేకపోయినా శ్రుత పాండిత్యం కొంత ఉంది.

వీరిద్దరికీ ఆంగ్లభాషా సాహిత్యాలన్నా, పాశ్చాత్య సంస్కృతిలోని మేలుగుణాలన్నా వల్లమాలిన అభిమానం. జాతీయవాదం పేరుతో ఆ అభిమానాన్ని దాచుకోడానికి వారెన్నడూ ప్రయత్నించలేదు. ఆంగ్లంలో రచనలు చేయాలనే పూనిక వీరిద్దరికీ విద్యార్థి దశలోనే కలిగింది. దత్తు బిషప్ కాలేజీలో చదివే రోజుల్లోనే తన పర్షియన్ గజళ్లకు ఇంగ్లీషు అనువాదం చేసి వినిపించేవాడు. ఆయన తన తొలి రచనలన్నీ ఇంగ్లీషులోనే చేసాడు. గురజాడ 1882లో విద్యార్థి దశలోనే ''కుక్క'' అన్న ఇంగ్లీషు

డా॥ యు. ఏ. నరసింహమూర్తి, విజయనగరం, మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా పదవీ విరమణ చేసి, అక్కడే యు. జి. సి. ఎమిరిటస్ రీసెర్చి ఫెలోగా ఉంటున్నారు.

పద్యాన్ని రాసాడు. 1883లో ''సారంగధర'' అన్న ఇంగ్లీషు పద్య కావ్యం రాసాడు. తన తమ్ముడు శ్యామలరావుతో కలసి ''ఇండియన్ లీజర్ అవర్'', ''తెలుగు హార్ప్'' అన్న పత్రికలలో ఇంగ్లీషు పద్యాలు రాస్తూ ఉండేవాడు. ''సారంగధర''ను మెచ్చుకొని కలకత్తా నుండి వచ్చే ''రీస్ అండ్ రయ్యత్'' అన్న ఇంగ్లీషు పత్రికాధిపతి శంభుచంద్ర ముఖర్జీ దానిని తన పత్రికలో రెండోసారి ప్రచురించారు. గురజాడ రాసిన ''చంద్రహాస'' అనే ఇంకొక ఆంగ్ల కావ్యం లభ్యం కావడం లేదు. సారంగధర, చంద్రహాస కావ్యాల రచనకు దత్తు రాసిన 'మేఘనాధ వధ' కావ్యం ప్రేరణ నిచ్చి ఉండవచ్చును.

ఇద్దరికీ కొంత కాలానికి ఆంగ్ల రచనలు మాని మాతృభాషలో రచనలు చేయాలనే తలంపు కలిగింది. ఇద్దరూ తొలి ప్రయత్నంగా నాటక రచనకు పూనుకొన్నారు. ఇద్దరూ భారతీయమైన నాటక రచనా పద్ధతిని వ్యతిరేకించి, పాశ్చాత్య నాటక రచనా రీతిని, అందులోనూ షేక్స్పియర్ నాటక సరళిని ప్రధానంగా స్వీకరించారు.

''నా నాటకంలో విదేశీయత కొంత ఉందని నాకు బాగా తెలుసు. కానీ నేను రాసిన భాషలో వ్యాకరణ దోషాలు లేవు. భావాలు హేతుబద్ధంగాను, దీప్తి మంతంగాను ఉన్నాయి. ఇతివృత్త నిర్మాణం ఆసక్తికరంగా ఉంది. పాత్ర చిత్రణ సవ్యంగా ఉంది. అందులో విదేశీయత ఉంటే మాత్రం నాకేం లక్ష్యం? మూర్ కవిత్వంలో ప్రాచ్య దేశ లక్షణాలు నిండి ఉన్నాయని, బైరన్ కవిత్వంలో ఆసియా వాతావరణం నిండి ఉన్నదని, కార్లైలో వచనంలో జర్మన్ లక్షణాలున్నాయని వాటిని నువ్వు తిరస్కరిస్తున్నావా! నాలాగా ఆలోచించే దేశీయుల కోసమే నేను రాస్తున్నానని, పాశ్చాత్య నాగరికతా సంస్కారాన్ని ఆమోదించే వారి కోసమే రాస్తున్నానని మరచిపోకు. ఎంతసేపూ అన్ని విషయాల్లోనూ సంస్కృతిని పట్టుకు వేళ్లాడే దాస్యవృత్తిని నేను తిరస్కరిస్తున్నాను. ఓ పురాతనుడా! సారస్వత విషయాల్లో ఎరువు దుస్తులు ధరించి లోకం ఎదుట ధైర్యంగా నిలబడగలను. గుండె నిబ్బరంతో ఉండు, ఈ పండితులందరు గుండెలు బాదుకొనేలా గొప్ప నాటకాన్నే రాస్తాను. చిన్న చిన్న మార్పులైతే సహిస్తాను గానీ, నా నాటకాన్ని తిప్పి తిప్పి రాస్తానంటే ఆ నాటకాన్ని తగలేస్తాను'' అని దత్తు తన మిత్రుడు గురుదాస్ బసాక్‌కు రాసిన లేఖలో పేర్కొన్నాడు. ''నాటక కర్తగా నేను నిలవాలంటే విశ్వనాధుని ''సాహిత్య దర్పణం''లో చెప్పిన సూత్రాల ముందు తలవంచితే కుదరదు.[2]

తాను రాసిన ''కృష్ణకుమారి'' నాటకాన్ని గురించి చర్చిస్తూ దత్తు తన మిత్రునికి రాసిన లేఖలో ఇలా పేర్కొన్నాడు. "We Asiatics are of a more romantic turn of mind than our European nighbours...... In the great European drama, you have the stern realities of life, lofty passion and heroism of sentiment. With us, it is all softness, all romance. We forget the world of reality and dreams of Fairy - lands. The genius of drama has not yet received even a moderate degree of development in this country. Our are dramatic poems; and even Wilson, the great foreign admirer of our ancient language, has been compelled to admit this. In the sharmishthe, I often stepped out of the path of the dramatist, for that of the mere poet. I often forgot the real insearch of the poetical. In the present play I mean to establish a

vigilant guard over myself..... I shall endeavour to create characters who speak in nature suggests and not mouth mere poetry".[3]

దత్తు తన బెంగాలీ నాటకాలకు ముందుగా ఇంగ్లీషులో పీఠికలు రాసాడు. గురజాడ కూడ దీనిని ఒరవడిగా తీసుకొని కన్యాశుల్కం తొలి, మలి కూర్పులకు ఇంగ్లీషులోనే పీఠికలు కూర్చాడు. గురజాడ కంఠోక్తిగా చెప్పకపోయినా దత్తులాగే భరతుడి నుండి విశ్వనాథుడి వరకు ఉండే ఆలంకారికులు చెప్పిన నాటక లక్షణాలన్నింటిని తృణీకరించాడు. వస్తువు, నాయకుడు, రసము మొదలైన ప్రధాన విషయాలలో సైతం పూర్తిగా ఆలంకారిక మార్గాన్ని పరిహరించి తనదైన స్వతంత్ర మార్గాన్ని అనుసరించి దత్తువంటి బెంగాలీ నాటక కర్తలందరి కంటే విలక్షణమైన త్రోవ తొక్కాడు. దత్తు తన మిత్రునికి రాసిన లేఖలో కొనసాగించిన చర్చకు సారాంశమా? అన్నట్లుగా, "...... the condition of the Telugu stage can, by no means be considered to be satisfactory. There ae no theatres worth the naem, and no professional actors who practise acting as an art. There are not many good plays either. Modern life which presents complex social conditions is neglected by play - wrights except for purposes of the brodest farce and poverty of invention is manifested by the constant handling of thread bare romantic topics". అంటూ రెండవ కన్యాశుల్కం పీఠికలో రాసిన వాక్యాలు కనిపిస్తాయి. గురజాడ ఇతర సందర్భాలలో చేసిన కొన్ని వివరణలు కూడా తమకంటే ముందున్న భారతీయ నాటకం పట్ల వీరిద్దరికీ గల ఏకాభిప్రాయాన్నే వ్యక్తం చేస్తాయి.

గురజాడకు, దత్తుకు గల దగ్గర పోలికను సమర్థించే విషయం ఇంకొకటుంది. దత్తు శర్మిష్ఠ, పద్మావతీ నాటకాల (1859-60) రచనా కాలం మధ్య హాస్యరస ప్రధానాలైన లఘు నాటకాలను రాసాడు. అవి ''ఏకైక బొలేసభ్యతా'', ''బురోశాలికేర్ ఘరేరోఁ''. ఇందులో మొదటిది డరోజియన్లకు వారసులై తెలిసీ తెలియని పాశ్చాత్య నాగరికతా వ్యామోహంతో సంప్రదాయాన్ని వ్యతిరేకిస్తూ సమాజంలో అరాచకాన్ని సృష్టిస్తున్న యువతరాన్ని అధిక్షేపించే రచన, రెండవది పూర్ణాచారపరాయణులుగా కనిపిస్తూ కామవికారం వంటి అవలక్షణాలు నన్నింటిని పెంచుకొని భ్రష్టులైన అగ్రవర్ణ వృద్ధులకు వాతలు పెట్టే రచన. ఈ రెండు రచనలు కలకత్తాలో సామాన్య జనుల వాడుక భాషలో రాసినవి. "These may be regarded as the first genuine comedies in the Bengali language". అని గుహాఠాకుర్తా వంటి విమర్శకులనేకులు భావించారు.[4]

కన్యాశుల్కంలో ఉన్న అనేక సమస్యలలో పై రెండు రచనలలో ఉన్న సమస్యలు కూడా కనిపిస్తాయి. గిరీశం పాత్ర ''ఏకైక బొలే సభ్యతా'' అనే రచనలోని ''నవ కుమార్'' అనే పాత్రకు ప్రతికృతిగా కనిపిస్తుంది. గిరీశంలో డరోజియన్ల గుణాలతో పాటు కొన్ని అదనపు లక్షణాలు కూడా ఉన్నాయి. ముసలి వయసులో మూడో పెళ్లికి సిద్ధపడిన లుబ్ధావధాన్లులో రెండవ రచనలోని భక్త ప్రసాద్ లక్షణాలు కనిపిస్తాయి. ఆవ్యవస్థను దత్తు అధిక్షేపించిన ధోరణి అంతా లుబ్ధావధాన్లు కథను అంటిపెట్టుకొని ఉంది. తెలుగులో తొట్టతొలిసారిగా పూర్తిగా వాడుకభాషలో రాసిన నాటకంగా ఖ్యాతి పొందిన కన్యాశుల్కం కంటే మూడు దశాబ్దాలు పూర్వమే ఈ రెండు రచనలు సామాన్య జన వ్యవహార భాషలో

ఉన్నాయి. గురజాడ ఈ రచనల వలన ప్రత్యక్షంగా ప్రభావితుడైనట్లు కనిపిస్తుంది. ఇందులో మొదటి రచనను దత్తు స్వయంగా "is this called culture?" అనే పేరుతో ఇంగ్లీషు భాషలోకి అనువదించాడు. ఆ అనువాదాన్ని గూర్చి గురజాడ తెలుసుకొని ఉండవచ్చును.

దత్తు బెంగాలీలో నూతన ఐతిహాసిక వాద సృష్టికర్త అయ్యాడు, నిమ్నవర్గాల జాతరలు, పాంచాలీ గీతాలు వంటి కళారూపాలలో వాడే భాష, వస్తువు అతనికి కలవర పరిచాయి. సమకాలీన బెంగాలీ సాహిత్యంలో వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు వంటి మహాకవులు లేక పోవడానికి నిమ్న వర్గ కళారూపాలే కారణమని, వారిని ఏవగించుకోవడంలో బంకించంద్ర ఛటర్జీతో చేతులు కలిపాడు.[5] ''మేఘనాథవధ'' కావ్యంలో అతడు ప్రయోగించిన ఉద్దండ శైలిని అనంతర కాలంలో రవీంద్రనాథ్ టాగూర్ వంటి వారు వ్యతిరేకించారు. కలకత్తాలోని జేమ్స్ రెవరెండ్ వాంగ్ వంటి ఆంగ్లేయులు కొందరు భద్రలోక వర్గానికి సామాన్య జనుల వాడుక భాషపట్ల ఏవగింపు కలిగించి, ఆ భాషతో పాటు రాజారామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, అక్షయకుమార్ దత్తా వంటివారు సృష్టించిన గంభీర శైలిని కూడా విడిచిపెట్టి, మధ్య తరగతి విద్యావంతులకు ఆకర్షకంగా ఉండే సరళమైన ఒక నూతన సాహిత్యశైలిని సృష్టించేందుకు ప్రోత్సహించారు. బంకించంద్ర ఛటర్జీ రచనలలో ఆ శైలి రూపొందింది. దత్తు నాటకాలు రాసే కాలం నాటికి అటువంటి శైలిపట్ల ఆకర్షితుడయ్యాడు. "In language, he breathed lyrical fervour into the hardness of prose, giving the latter a cryptic dramatic quality which distinquishes it from Alater Gharer Dulal. One has only to read Michael's farces to know what contribution he made to the dramatic prose of Bengal.[6] అమర్ ముఖర్జీ ప్రశంస మాట ఎలా ఉన్నా దత్తు ప్రక్రియతో మాత్రమే కాక వస్తువుతో కూడా భాష మారుతుందని తన నాటకాలతో నిరూపించాడు. అతడు తన ప్రహసనాలలో ఉపయోగించిన భాషను శర్మిష్ఠ, పద్మావతి, కృష్ణకుమారి వంటి నాటకాలలో ఉపయోగించలేదు. ఆ నాటకాలలో సమకాలీనమైన నేలబారు భాషను విడచి సంస్కృత పద ప్రచురమైన శైలిని రూపొందించాడు. శర్మిష్ఠతో పాటు వ్రాసిన ప్రహసనాలు రెండూ పూర్తిగా వచనంలోనే ఉన్నాయి. మిగిలిననాటకాలలో పద్యాలు కూడా ఉన్నాయి. గురజాడపరిపూర్ణంగా వాస్తవికవాది. 19వ శతాబ్దంలో ఫ్రాన్స్‌లో ఆరంభమైన వాస్తవిక వాద సాహిత్యానికి ఆంధ్ర దేశపు తొట్టతొలి ప్రతినిధి గురజాడ. అందుచేత దత్తు ప్రహసనాలలో వాడిన సామాన్య జనుల వాడుక భాష అతనికి ఆదర్శప్రాయమైంది. అతడు ఇంచుమించుగా రెండు దశాబ్దాల పాటు కన్యాశుల్కాన్ని గూర్చి చేసిన ఆలోచన అంతా వాడుకభాషలోనే నడిచింది. అది కన్యాశుల్కం విజయానికి కారకమయింది. ఆంధ్రదేశపు పండితులు కొందరు ఆ భాషను ఈసడించినా విద్యావంతులలో అధికశాతం చదువరులను ఆ భాష అమితంగా ఆకర్షించింది. కొండుభట్టీయం, బిల్హణీయం అనే రెండు ఇతర నాటకాలను గురజాడ పూర్తి చేయలేక విడిచిపెట్టడానికి ఆ నాటకాలలో ఉపయోగింపబడిన భాషను గూర్చి సమాధానపడలేకపోవడం కూడా ఒక కారణం కావచ్చును. ఎంత సుకుమారమైనదైనా నాటకంలో ఆలంకారికశైలికి స్థానం లేదని గురజాడ భావించినట్లు తెలుస్తుంది.

వలస పాలనలోని భారతీయ విద్యార్థులను, సాహిత్యకారులను గూర్చి చెప్తూ "Shakespeare

became the "Cultural Metonymy" of the colonizer's" అని చెప్తూ అభిజీత్ సేన్ "Much of this may be seen as an inheritance of the efforts of Michael Madhusudan Dutta, who reacting against the mindless borrowings from sanskrit drama had tried to import western models for Bengali dramaturgy". అని దత్తు ప్రభావాన్ని గూర్చి వివరించారు.[7] గురజాడ కూడా ఈ వారసత్వాన్ని స్వీకరించాడు. మైఖేల్ మధుసూదన దత్తు షేక్స్పియర్ నాటకాల చేత ప్రభావితుడైతే కావచ్చుగానీ వాటినే పరిపూర్ణంగా అనుసరించలేదు. పాశ్చాత్యులకు, మనకు గల అనేకమైన భేదాలను ఆయన ఆకళించుకొన్నాడు. అందుకే మేరమీరి ఆ ప్రభావానికి లోను కాలేదు. సమకాలీన భారతదేశంలో సంభవిస్తున్న సామాజిక, నైతిక పరిణామాలను దృష్టిలో పెట్టుకొని తాను నాటకాలు రాస్తున్నట్లుగా తన స్నేహితుడు రాజనారాయణకు రాసిన లేఖలో పేర్కొన్నాడు. గురజాడ కూడా ఈ మార్గంలోనే ప్రయాణించాడు. ఇతరేతర ప్రభావాల విషయంలో వీరిద్దరి మధ్య ఒక పోలిక కనిపిస్తుంది. వీరిద్దరూ సంస్కృత నాటక సంప్రదాయాన్ని తిరస్కరించినా, దత్తు శర్మిష్ఠమీద రత్నావళి ప్రభావము, గురజాడ కన్యాశుల్కం మీద మృచ్ఛకటికం ప్రభావము స్ఫుటంగా కనిపిస్తాయి. సంప్రదాయం మీద దత్తు తిరుగుబాటును గూర్చి గుహాఠాకుర్తా "No doubt, Sarmistha marked a revolt against classical traditions, but the revolt was more in spirit than in form, and more in the nature of aspiration than fulfilment.[8] ఈ విషయానికి వస్తే గురజాడ తిరుగుబాటు పాక్షికమైనది కాదు, పరిపూర్ణమైనది. దత్తు సాహిత్య నాటక రచన పట్ల ఆసక్తి చూపించాడు. గురజాడ చరిత్ర రచన పట్ల ఆసక్తి చూపించాడు, కానీ రాయలేకపోయాడు.

ఇద్దరి దృష్టి నాటక రచన అనంతర దశలో మాతృభాషలో కవిత్వం రాయడం పట్ల మళ్లింది. పద్యరచన విషయంలో భాష, ఛందస్సు, ప్రక్రియ అనే మూడు అంశాలలోను వీరిద్దరి మధ్య ఆసక్తి కరమైన పోలికలు కనిపిస్తాయి. పద్యానికి సంబంధించిన భాషను గురించి "He would rather accept the view of Thomas Gray who declared that "The language of the age is never the language of poetry; and on one occassion, he is said to have retorted against an advocate, about the use in poetry of the common Bengali Speaker's every day diction".[9] అని దత్తు అభిప్రాయంగా అమరేందు బోస్ చెప్పారు. ''పొమ్మనక్కర్లేదు, పొగ బెడితే చాలు'' అన్న మాదిరిగా గురజాడ ఎక్కడా సామాన్య జనుల వాడుక భాష కవిత్వానికి పనికి రాదని కంఠోక్తిగా ప్రకటించక పోయినా ఆచరణలో మాత్రం ఆ అభిప్రాయాన్ని స్పష్టం చేసాడు. ఆయన నాటకంలో రాసిన భాష వేరు, ముత్యాల సరాలలో రాసిన భాష వేరు, పద్యాలలో రాసిన భాష వేరు, కథలలో రాసిన భాష వేరు - అని ఎవరైనా గ్రహించగలరు. ఛందస్సు విషయంలో కూడా "Michael is the first Indian (for the matter of that, the first Asian) poet to write in the English pattern of the blank verse, Michael's pioneering and triumphant applicaiton of this verse form has served as a revolutionary force in Modern Bengali Verse - from and has also encompared from". అన్న అమరేందు బోస్ మాటలు గుర్తింపదగినవి.[10] బెంగాలీ కవిత్వ రంగంలో blank-verse ను ప్రవేశపెట్టడం ద్వారా ఒక ఛందో విప్లవాన్ని సాధించి దత్తు ఆధునిక భారతీయ కవులందరికీ ఆ విషయంలో మార్గ దర్శకుడయాడన్నది

ప్రసిద్ధమైన విషయము. దత్తు బాటలోనే నడచి గురజాడ ఆధునికాంధ్ర కవిత్వానికి ముత్యాలసరం అనే ఒక అద్భుతమైన ఛందాన్ని ప్రసాదించాడు. గురజాడ ననుసరించి తెలుగు కవులనేకులు ఆ ఛందంలో కవితలు రాసారు. నూతన ఛందః పరికల్పనలో దత్తు పాశ్చాత్య ఛందో మార్గాన్ని అనుసరిస్తే గురజాడ జానపద ఛందోరీతని అనుసరించి తన ప్రత్యేకతను చాటుకొన్నాడు. దత్తు, గురజాడ లిద్దరూ బెంగాలీ, తెలుగు కవిత్వాలలో ప్రక్రియా పరమైన ప్రయోగాలు కూడా చేసారు. దత్తు ఆంగ్లకవిత్వంలోని sonnet అనే ప్రక్రియననుసరించి ''చతుర్దశి పది'' అనే నూతన పద్య ప్రక్రియను చేపట్టాడు. కొన్ని ఇతర లఘు పద్య ప్రక్రియలను కూడా అనుసరించాడు. గురజాడ కూడా తన పద్య రచనలో పాశ్చాత్య పద్య రచనా ప్రక్రియ ననుసరించాడు. ముఖ్యంగా sonnet, ode వంటి ప్రక్రియల ననుసరించి మనిషి, దించులంగరు, లంగరెత్తుము, ఛోట్టు వంటి లఘు పద్యాలను కూర్చాడు. ఈ సందర్భంలో పేర్కొనదగిన ఇంకొక విశేషాంశం ఉంది. దత్తు Blank Verse లో ''సుభద్ర'' అనే నాటకాన్ని రెండంకాల వరకు రాయటమే కాక ఆ ఇతివృత్తాన్ని గూర్చి "The best suited for poetry in every language". అని పేర్కొన్నాడు.[11] గురజాడ సుభద్ర కావ్య రచనను తలపెట్టడానికి ఇది ప్రేరణ కావచ్చును.

పాశ్చాత్యులను, పాశ్చాత్య సంస్కృతిని అమితంగా ప్రేమించిన వీరిద్దరిలో విలక్షణమైన జాతీయ భావావేశావిష్కరణలో కూడా పోలిక కనిపిస్తుంది. ఆధునిక భారతీయ సాహిత్యంలోకెల్లా జాతీయ భావావేశ ప్రకటనలో మొదటిదైన ''అమర'' అనే పదాన్ని దత్తు రాసాడు. దీనికి దీటైన రచనగా దేశభక్తి గేయాన్ని గురజాడ కూర్చాడు.

ఇద్దరూ సంఘ సంస్కరణ భావాలు కలవారు. స్త్రీల సమస్యలను గూర్చి ఇద్దరూ ఒకే విధంగా స్పందించారు. హిందూ స్త్రీల విద్యావసరాన్ని గురించి వారి సంతానంపై దాని ప్రభావం గూర్చి మధుసూదన్ దత్తు వ్రాసిన వ్యాసానికి హిందూ కాలేజీలో బంగారు పతకం లభించింది. స్త్రీ జనోద్ధారకులుగా పేరు పడిన వీరిద్దరూ వారి విషయంలో ఘోరమైన తప్పిదం చేసారు. దానిలో కూడా ఒక పోలిక కనిపిస్తుంది. దత్తు తన తండ్రి తనకు 14 సంవత్సరాల వయసు కూడా లేని పిల్లతో పెళ్లి చేస్తానంటే అలిగి ఇల్లు విడిచి పారిపోయాడు. అతడే కొన్ని దశాబ్దాల తరువాత తన 15 సంవత్సరాల కుమార్తెకు వివాహం చేసాడు. ఆ విషయంలో కూడా దత్తును ఆదర్శంగా గ్రహించాడేమో అన్నట్లుగా గురజాడ తన 11 సంవత్సరాల కుమార్తెకు వివాహం చేసాడు. ఆధునిక భావాలు కలవారు ఈ విషయంలో వీరిద్దరినీ తప్పుపడుతూనే ఉన్నారు. దత్తు జీవితాంతం హాస్యప్రియుడుగా ఉండే వాడు. చతుర సంభాషణ చేసేవాడు. అతని లేఖల్లో తప్ప ఇతర రచనలలో హాస్యం ఉండేది కాదు. ఇది అతనిలో వ్యక్తికీ, రచనకీ ఉండే వైరుధ్యం. గురజాడ వ్యక్తిత్వం ఇందుకు భిన్నంగా ఉంటుంది. మత విషయంలో ఈ ఇద్దరి మధ్యా తేడా కనిపిస్తుంది. దత్తు సనాతన ధర్మాన్ని వదలి క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు. క్రైస్తవ మతాన్ని స్వీకరించాడు గానీ క్రైస్తవ ధర్మాన్ని పాటించలేక ఇటూ - అటూ ఊగిసలాడి రెంటికీ చెడిన రేవడిలా రెండు సమాజాలకూ దూరమయ్యాడు. కొన్నాళ్లు తీవ్ర బహిష్కరణలకు గురి అయ్యాడు. నలుగురిలో బ్రతకలేక నదికి ఆవలి ఒడ్డున ఒంటరిగా నివసించాడు. కుటుంబ జీవనంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాడు. ఎంత ప్రాభవాన్ని అనుభవించాడో

అంతటి పేదరికాన్ని కూడా చూచాడు. ఆధునిక బెంగాలీ సాహిత్య నిర్మాతగా ఎనలేని పేరు ప్రతిష్టలనార్జించినా, తిరుగుబాటుదారునిగా, వ్యసనపరునిగా, అంతటి తిరస్కారాన్ని కూడా అనుభవించాడు. ఆ రోజులలో దత్తు నిరంతర మధ్య పానాసక్తుడుగా పేరు పడ్డాడు. దీనబంధు మిత్రా ''నీమ్‌చంద్'' అనే ప్రసిద్ధ పాత్రను దత్తుకు ప్రతిరూపంగా కల్పించాడని ఒక ప్రతీతి. గురజాడను కూడా సనాతనులు ద్వేషించారు. కానీ రాజాశ్రయం కారణంగా ఆద్వేషానికి బలం చేకూరలేదు. గురజాడ సనాతన ధర్మాన్ని తలదాల్చలేదు. కానీ ఆ మతాన్ని వదులుకోలేదు. మధ్యపానం, మాంస భోజనం ఆయన కలవాటని తెలుస్తోంది. కానీ ఇవేవీ ఆయనకు కష్టాలను తెచ్చిపెట్టకపోయినా అనారోగ్యంతో పాటు సాంసారిక సమస్యలు తనను నిరంతరం బాధిస్తున్నట్లుగా గురజాడ చెప్పుకున్నాడు.

''విరిగి పెరిగితి; పెరిగి విరిగితి;
కష్ట సుఖముల పార మెరిగితి;
పండునన్నవి ఆశలెన్నో
మొండి రాలగ బొగిలితిన్'' (లంగరెత్తుము) అన్న అనుభవం బెంగాలీ, తెలుగు ఆధునిక సారస్వత నిర్మాణానికి వేగుచుక్కలైన వీరిద్దరికీ వర్తిస్తుంది.

"There can be no history of modern Indian literature without an account of the life and works of Michael Madhusudan Dutt" అన్న ఖ్యాతి దత్తుకు దక్కింది. గురజాడకు మాత్రం ఆధునికాంధ్ర సాహిత్యం మేరకే ఈ ప్రశస్తి లభించింది.

**అధఃసూచికలు :**


1) The Bengal Renaissance And After, The Picador Book of Modern Indian Literature, Ed. By Amit Chaudhuri, Picador - 2002, P. 4
2) Michael Madhusudan Dutta Jivan Charit, Lelter No 16 & 18, P: 247, P: 317
3) Priyaranjan Sen, Western influence in Bengali literature, P. 175
4) P. Guha Thakurta, The Bengali Drama, Its origin and development, London, Trubner & Co, LDD, 1930, P. 82
5) Sumanta Banerjee, The Parlour and the Streets Elite and Popular Culture in Nineteenth Century Calcutta, P. 160
6) Amar Mukherjee, Bengali Drama and Theatre, A paper submitted to the seminar conducted by the National School of Drama.
7) Abhijit Sen, some Shakespeare an negotiations in the Indian Theatres, Colonial and post colonial Shakespeare's papers & procedings of the world Shakespears conference Calcutta 2000
8) P. Guha Thakurta, The Bengali Drama: Its origin and development, London, Trubner & Co, LDD, 1930, P. 75
9) Amalendu Bose, Michael Madhusudan Dutt, Makes of Indian Literature, Sahitya Academy, P. 61
10) Ibid.

# శబ్ద 'చిత్ర' సంకేతం

- ఎల్.ఆర్. వెంకటరమణ

పరిసరాలకు సర్దుబాటు చేసుకోవడంలో వ్యక్తి కొన్ని ఒత్తిళ్ళుకు, సంఘర్షణలకు లోనవుతుంటాడు. మనం చేస్తున్న ప్రతి పనికి తగినంత ఒత్తిడి అవసరం. ఆ పని యొక్క ఫలితాన్ని పొందినపుడు పడిన శ్రమను మరచిపోతాం. ఒత్తిడి లేని స్థితిని మనిషి ఇష్టపడడని ముర్రే అనే మనో వైజ్ఞానిక శాస్త్రవేత్త అంటాడు. వాస్తవాలను ఎదుర్కొంటూ సమస్యలను పరిష్కరించుకోలేనపుడే ఒత్తిడికి గురవుతాం. దీనిని సర్ది చెప్పుకోవడానికి రక్షక తంత్రాలను వాడుతూ తాత్కాలిక ఉపశమనాన్ని పొందుతాం.

తాను నమ్మిన సిద్ధాంతాలను వదులుకోలేక, నివస్తున్న సమాజ పరిసరాలలో ఇమడలేక సర్దుబాటుకాని ధోరణితో జీవితాన్ని గడిపిన శాస్త్రవేత్త మోర్స్. టెలిగ్రాఫ్ కనుగొన్న శాస్త్రవేత్తగా మనందరికీ పరిచయ మున్న వ్యక్తి. కళ నుండి శాస్త్రానికి మారినవాడు. చిత్రకళా రంగంలో కృషిచేసి రాఫెల్, మెకెలాంజిలో వంటి ప్రసిద్ధ చిత్రకారుల సరసన తన చిత్రాలను ఉంచాలని తపించిన వాడు. ఎన్నో ఆదర్శభావాలతో చిత్రకళను చేపట్టాడు. ''కళను వ్యాపారం చేసేటంత నీచుణ్ణికాను. గౌరవ యుతంగా జీవించలేకున్నా ఆహారం లేక మరణించైనా మరణిస్తాను కానీ కళను నీచానికి గురిచేయను'' - అన్న గొప్ప భావనతో చిత్రకళా స్రవంతిలోకి వచ్చాడు.

శామ్యూల్ ఫిన్లే బ్రీజ్ మోర్స్ 1791 లో న్యూయార్క్‌లో ఒక మతాచార్యునికి జన్మించాడు. యేల్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. ఆల్‌స్టన్ ప్రియ శిష్యునిగా చిత్రకళ అభ్యసించాడు. మోర్స్‌ను చిత్రకళవైపు పంపడానికి అతని తండ్రికి ఎంతమాత్రం ఇష్టంలేదు. కానీ ఆల్‌స్టన్ వంటి ఉన్నత భావాలున్న వ్యక్తి వద్ద శిష్యరికం అంటే మంచి మార్గం ఏర్పడుతుందని సమ్మతించాడు. ఆల్‌స్టన్‌తో కలసి లండన్ పర్యటించాడు. కొంత కాలానికి ఆర్థిక ఇబ్బందుల వలన అమెరికా తిరిగి వచ్చేయాల్సివచ్చింది. ''మరణిస్తున్న హెర్క్యులస్'', ''జ్యూపిటర్ తీర్పు'' వంటి పురాణ సంబంధ చిత్రాలు వెంటతెచ్చాడు. ఇతని కల్పిత పురాణ మిశ్రమ చిత్రాలు కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు.

ఇదే కాలంలో చిత్రకారుల చిత్రాలు అమ్మడానికి, కొనడానికి సంబంధించిన సంస్థలు లాంటివి, చిత్రకళాకారుల శిక్షణకు సంబంధించిన అకాడమీలు అమెరికాలో అంతగాలేవు. కొందరు చిత్రకళలో ప్రవేశమున్న ధనికులు జట్టుగా కలసి ఒక అకాడమీ స్థాపించుకున్నారు. జాన్‌ట్రంబుల్ వంటి ఉన్నత వ్యక్తి అధ్యక్షునిగా నియమించబడ్డాడు. కొంత కాలానికి ఇతడు తాను ఇతర చిత్రకారులకన్నా జన్మతః గొప్పవాడుగా చాటుకొని నిరంకుశుడుగా వ్యవహరించాడు. దీంతో ట్రంబుల్‌తో సమాన హోదా కలవ్యక్తి, ఉన్నత కుటుంబీకుడు అయిన మోర్స్‌తో కలసి కొందరు ప్రతిపక్ష అకాడమీని స్థాపించుకున్నారు.

---

ఎల్.ఆర్. వెంకటరమణ ఉపాధ్యాయులు, జడ్.పి. హైస్కూల్, మోడ,
పరిగిమండలం, అనంతపురం జిల్లా.

ఆదర్శయుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో వీరి అకాడమీ స్థాపన జరిగింది. ఉన్నత భావాలు కలిగి ఉండడమే కాకుండా, స్వార్థ బుద్ధి, కుటిలనీతి వంటివి కళల జోలికి పోనీక చిత్రకారులు కృషిచేయాలని విజ్ఞప్తి చేశాడు. అంతేకాక కళను కళాభిమానంతో ముందుకు తీసుకెళ్ళాలని, దురాశతో కాదంటూ మోర్స్ అకాడిమీ సంబంధిత సిద్ధాంతాలను వెల్లడించాడు. స్వేచ్ఛతో చిత్ర రచనకు, తావిచ్చాడు.

వారికిచ్చిన స్వేచ్ఛా స్వాతంత్రాలవల్లే తనకు అపవాదు వచ్చిందని మోర్స్ కొంత కాలానికి గుర్తించాడు. తన సహచరులే తనను నిర్లక్ష్యం చేస్తున్నారని మదన పడేవాడు. విదేశాలలో శిక్షణ తీసుకొని వచ్చిన వాడైన తనకు సరియైన గుర్తింపు ఇవ్వక అనామకుని చేస్తున్నారని వాపోయేవాడు. పైకి ఏమీ అనలేకున్నా లోన నిర్లిప్తతకు గురయ్యాడు. మానసిక సంఘర్షణలకు గురయ్యాడు. యూరప్ లోని దేశాలలో పేరూ, ఊరూ లేని వారు శ్రేణీ చిత్రకారులుగా గుర్తించబడుతుంటే, తనను ఇక్కడ ఎవరూ పట్టించుకోరేమని సన్నిహితుల దగ్గర వాపోయే వాడు, దీంతో చిత్ర కళపై ఆసక్తి సన్నగిల్లడం మొదలైంది.

ఇలా తనలో తాను మదన పడతూ, చిత్రకళను తీరస్కరించే స్థితికి వచ్చాడు. సమకాలీన చిత్రకారులతో వాదవివాదాలకు దిగేవాడు. ఎన్నో సంవత్సరాలుగా వేచియున్న చిత్రకారునిగా మంచి చిత్ర రచనకు ఆత్రంగా ప్రాకులాడేవాడు. కుంచె తీసుకొని ఉన్నత చిత్రం ఎలాగైనా రచించాలని పట్టుదలతో పనికి ఉపక్రమించే వాడు. కానీ అంతలోనే ఏదో నిర్వేదంతో కుంచెను క్రిందపెట్టేసేవాడు. ఇలా చివరకు చిత్ర కళనే త్యజించాలను కున్నాడు.

''చిత్రకళ అన్నది అనేకుల దృష్టిలో కౄరప్రేయసి, కానీ నా విషయంలో కౄర వేశ్యగా పరిణమించింది. నేను ఆమెను త్యజించలేదు. ఆమే నన్ను వదలి వెళ్ళిపోయింది'' అంటూ వాపోయేవాడు. తన ఆదర్శాలు చాలా ఉన్నతమైనవి కనుకనే చిత్రకళలో తనకు అసఫలత ఎదురవుతోంది అంటు తనకు తాను సమాధానం చెప్పుకొనేవాడు మోర్స్. తనలో కలుగుతున్న మానసిక సంఘర్షణలను తట్టుకోవడానికి తాత్కాలిక ఉపశమనంగా ''ప్రతివర్తనం'' (Reaction formation) అన్న రక్షక తంత్రాన్ని వాడుకున్నాడు. ఒక పని చేయలేని ఆశక్తతతో దానికి పూర్తి విరుద్ధ భావంతో చెప్పుకోవడమే ''ప్రతివర్తనం''.

అమెరికన్ సమాజం భౌతికమైనది, హృదయం లేని బండరాయి వంటిదంటూ తిరస్కరిస్తూ వచ్చిన మోర్స్, చివరకు కళను వదలి పూర్తిగా భౌతిక జగత్తుకు ఆకర్షితుడయ్యాడు. అంత వరకూ అతనిలో నిద్రాణమైన శాస్త్రం మేల్కొంది. ఆధునిక వృత్తి పరిశోధనలలో నిమఘ్నమైనాడు. ఈ సంగ్దిగ్ధ స్థితి నుండి రక్షించుకోవడానికి ''పరిహారం'' (compensation) అన్న రక్షక తంత్రాన్ని వాడుకున్నాడు. ఒక రంగంలో రాణించ లేని వ్యక్తి ప్రత్యామ్నాయ రంగం ఎంచుకొని కృషిచేయడమే పరిహారం.

మోర్స్ చిత్రాలను పరిశీలించినపుడు తన చిత్రాలలో ఉపయోగితావాదాన్ని అనుసరిస్తున్నట్లు

కనిపిస్తుంది. అతని చిత్రాలలో ఎంతో మంచి పేరున్నది ''లఫాయెటీ'' (మూడవ అట్టపై చిత్రం). ఈ చిత్రంలోని వీరుడు ముక్కుసూటితనంతో ఉన్నట్లు కనిపిస్తాడు. మోర్స్‌కూడా ఇలాంటి ముక్కుసూటి మనిషే నంటారు కళా విమర్శకులు. సౌందర్యాన్ని కూడా కళారాధన కాకుండా శాస్త్రయుతంగా చూడాలన్నది అతని వాదన అంటూ అభిప్రాయ పడతారు. ఇలాంటి భావనల వలనే మోర్స్ కళకు దూరమై శాస్త్రాన్ని దరి చేర్చుకున్నాడు. ఈ చిత్రంలోని అలంకరణలు వీరుని గొప్పతనాన్ని మరుగు పరుస్తాయంటాడు. చిత్రంలో గొప్పతనం అన్నది కాల్పానిక వస్తు చిత్రణలో కాకుండా యథార్థ జీవిత చిత్రణలోనే ఉంటుందనేది పండితాభిప్రాయం. చిత్రంలోని వీరుని ముఖంలోని గంభీరం, చుట్టూ కల కాల్పానిక వస్తు నీడలో మరుగుపడిపోతుంది.

ఇతని మరో చిత్రం 1831-33 మధ్య చిత్రించిన "Gallery of the Louvre", పారిస్‌లోని తారీ మ్యూజియంలోని చిత్రాలకు సంబంధి ంచినది. ఒక కుర్రజంట తమ చిత్రాన్ని చిత్రకారునితో గీయించుకుంటారు. దూరంలోని గోడకు ప్రసిద్ధ చిత్రకారుల చిత్రాలు వ్రేలాడ దీసి ఉంటాయి. దీనిని చిత్రం అనలేము. ఒక ఫోటోగ్రాఫులా ఉంటుంది. ఈ చిత్రాలు అతని పరిశోధనలు హృదయంలోని యథార్థవాదిని వెలుపలికి తెస్తాయి. (నాల్గవ అట్టపై చిత్రం)

మోర్స్ కళను వదలి శాస్త్రంలో పరిశీలనలు, పరిశోధనలు చేస్తున్న కాలంలో అతని భార్య మరణించింది. మన శ్శాంతి కోసమై యూరప్ వెళ్ళాడు. కొంత కాలానికి తిరిగి వస్తున్నాడు. అతడు వస్తున్న ఓడలోనే ఒక కుర్ర ప్రొఫెసర్ ''ఇనుప ముక్కను ఇన్సులేట్ చేసిన రాగి తీగతో చుట్టి, వోల్టాఘటంతో కలిపి దాన్ని అయస్కాంతంలా పనిచేయిస్తున్నాడు. రాగి తీగ వోల్టా ఘటానికి కలిపితే, ఇనుప ముక్కలు ఆకర్షించడం, ఘటానికి సంబంధం తీసివేస్తే, ఇనుప ముక్కలు వికర్షించడం చేస్తున్నాయి. ఓడలోని వారందరూ తమ హర్షాన్ని తెలుపుతున్నారు. పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఇదంతా గమనిస్తున్న మోర్స్ మస్తిష్కంలో మెరుపు లాంటి ఆలోచన వచ్చింది. విద్యుత్‌కు అయస్కాంత ధర్మం ఉంది. దీనితో వార్తా ప్రసారాల వినియోగం గురించి పరిశోధించాలని నిర్ణయం తీసుకున్నాడు. చిత్రకారుడు కావడంతో ఏవో బొమ్మలు, గుర్తులతో వ్రాసి పెట్టుకున్నాడు.

అమెరికా చేరగానే ఈ విషయంలో కృషి చేశాడు. తన సహాధ్యాయి అయిన ఆల్ఫ్రెడ్ వెయిల్ సహకారంతో టెలిగ్రాఫ్ పరికర రూపకల్పన చేశాడు. ఈ పరికర యంత్ర అభివృద్ధిలో వెయిల్‌పాలు పంచుకున్నాడు. 1837 సెప్టెంబర్ 4న వీరి నమూనా ప్రదర్శించబడింది. చిన్న సంకేతాలు డాట్ అని, కొంచం పెద్దవి, ఎక్కువ వ్యవధి కల సంకేతాలను డాష్ లన్న పేరుతో ఆంగ్ల అక్షరాలు, సంఖ్యలకు కోడ్‌లను తయారు చేశాడు. వీటి రూపకల్పనలో వెయిల్‌పాత్ర కూడా ప్రముఖమైనదే.

వార్తలను దూర ప్రాంతాల ప్రసారానికి, రిలే విధానం ఉండాలి. దీనికై జోసఫ్ హెన్రీ అనే వ్యక్తి మోర్స్‌కు సాయం చేశాడు. ఎన్నో ఒడిదుడుకులతో, ఛీత్కారాలు, సత్కారాలతో 1844 మే 24న ''భగవంతుడు ఏం చేశాడు'' (what hath god wrought) అన్న సందేశం టెలిగ్రాఫ్ ద్వారా

పంపబడింది. దీంతో మోర్స్ అంతవరకూ పడుతున్న శ్రమకు తగ్గ ఫలితం లభించింది. సంఘర్షణా యుత జీవితంలో మధుర క్షణాలకు, ఉద్వేగ స్థితి నుండి ఉల్లాసయుత జీవితానికి మరల్చబడ్డాడు. నిరంతర కృషితో నిరాశా నిస్పృహలకు తెరపడింది. అతను ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న క్షణాలను అతను చూడగలిగాడు.

అనేక యూరప్ దేశాలు మోర్స్ టెలిగ్రాఫ్‌ను ఆమోదించాయి. హాంబర్గ్ కక్స్‌హావన్‌ల మీదుగా 1848న తొలిసారి టెలిగ్రాఫ్ సౌకర్యం కల్పించబడింది. 1858లో లార్డ్ కెల్విన్ అనే శాస్త్రవేత్త ఆధ్వర్యంలో బ్రిటన్, అమెరికాల మధ్య టెలిగ్రాఫ్ సౌకర్యం కల్పించబడింది. 1872లో మోర్స్ మరణించే నాటికి ప్రపంచమంతా టెలిగ్రాఫ్ సౌకర్యం కల్పించబడింది.

రెండు విరుద్ధ కోరికల మధ్య ఏర్పడే తన్యత వల్ల వచ్చే బాధాకరమైన ఉద్వేగ స్థితినే ''సంఘర్షణ'' అనవచ్చు. ఈ సంఘర్షణను జీవితాంతం అనుభవిస్తూ వచ్చిన వ్యక్తి మోర్స్. సంఘర్షణలు తీవ్రతరమవుతున్నప్పుడు తాత్కాలిక ఉపశమనంగా రక్షక తంత్రాలు వాడుకొని, జీవితంలో నిలదొక్కుకుంటూ పడిలేచే కెరటంలా ముందుకు సాగగలిగాడు కాబట్టే - కళ, శాస్త్రాన్నే కాదు జీవితాన్ని ముక్కుసూటి మార్గంగానే పయనించి విజయం సాధించిన వ్యక్తి - శామ్యూల్ F.B. మోర్స్.

*References :-*


1. Prof. Tewari I.P., Formerely Director, IIMC, "Communication, Technology & Development", Publications Division, 1987.
2. James Thomas Flexner, American Art, (Tranl. in Telugu - P. N. Murthy) Prathima Books, 1964.
3. Dutchald Publications.
4. Voice of America Publications / broadcasting programmes.
5. Henry Jacobowitz, ""Electronics Made Simple". Doubledy & Company Inc (New York) Vakils, Feffer & Simons Pvt. Ltd., Bombay, 1966.
6. Somerset Fry, 1000 Great lives - American Edition.
7. Egon Larson, The History of Invention.
   (Travel in Telugu Nagabhushanam) Hyderabad Book Trust, 2003
8. Psychology Text Books, Academy & Other Publications.
9. George A.Miller, Psychology & Communications, Voice of America., US Information Services.

# కావ్య లక్షణం - మరో ప్రదక్షిణం

- బి. జగన్నాథరావు

కావ్యాన్ని పరామర్శించేముందు, కావ్యమంటే అది కేవలం పద్యాలతోనే సాగాలనే నియమమేమీ లేదని చెప్పడం జరుగుతుంటుంది. సాహిత్య ప్రక్రియలో దేనిలో రచన సాగించినా అది కావ్యం కావచ్చు. కావ్యలక్షణాలు, ప్రయోజనాలు అంతో ఇంతో వుంటే ఎవరికీ ఇబ్బందికరంగా వుండదు. పాఠకుల సంఖ్య నానాటికీ క్షీణిస్తున్న ఈ రోజుల్లో ఇది గుర్తుంచుకోవల్సిన విషయం.

ఋషి కానివాడు కవి కాలేడంటారు (నాన్ ఋషిః కురుతే కావ్యః). కవి, కవితల గురించి, వాటి ప్రాముఖ్యతను చెప్పటానికి ఇది ఒక గొప్ప ప్రశంశ.

No one merits the name of creator except God and Poet. - Shelley.

కవి మిగతా సమయాల్లో ఎలా వర్తించినా, కావ్య రచనా సమయంలో, ఋషిలా మారితేనే కాని సుకావ్య రచన చేయలేడు. సృజనాత్మక దృష్టి, 'విశ్వజనీనత ముఖ్యంగా కావాలి.

Poetry is some thing that a poet creates outside his personality.

- George Moore.

రవి మన చుట్టూ వున్న చీకటిని ఛేదించి మనకు జవసత్వాలను ఇస్తాడు. కవి మన 'లో' వెలుగునింపి, సన్మోర్గం చూడ మనకు వెసులుబాటు కల్పిస్తాడు.

కావ్యమంటే ఏమిటి, లక్షణాలు, వివరణ అది ఒక మహాసముద్రం. ఆ చర్చ సాగించే సాహసం, ప్రతిభ రెండూ లేవు నాకు.

Poetry is spontaneous overflow of powerful fealings. - William Words Worth.

శక్తివంతమైన భావాలు పెల్లుబికితే ఎంతటి మహా కావ్యాలు రూపొందుతాయో? వాల్మీకి రామాయణం ఇందుకు నిదర్శనం. బోయవాడు చేసిన ఘోరాన్ని కళ్ళారా చూసి, విచలితుడైన వేళ, అసంకల్పితంగా ఆతని నోటి నుండి వెలువడిన 'మా నిషాద ... శ్లోకం రామాయణానికి నాంది పలికింది.

రస పుష్టితో కూడిన కావ్యం పాఠక జన మనో రంజకం అవుతుంది. జన రంజనం చేయలేని ఏ రచనా 'కావ్య' పదానికి అర్హంకాదు.

'రసో వైసః' - రసమే ఆత్మ అన్నది జగద్విదితం.

---

బి. జగన్నాథరావు, హైదరాబాద్

కావ్యం రమణీయర్థాలను ప్రతి పాదించటంతో పాటుగా, పురుషార్థసాధన కారిగా కూడా వుండాలని ఓ అభిప్రాయం. ఓంకార స్వరూపుని నాద బ్రహ్మోపాసనతోను, శబ్ద బ్రహ్మోపాసనతోనూ పొందవచ్చు నంటారు.

రచనలు కావ్య ప్రయోజనాలు, లక్షణాల పేరిట, ఇబ్బంది కరంగా ఓ చట్రంలో బంధించటం సబబు కాకపోయినా, అంతో ఇంతో పద్ధతిగా ఉండాలను కోటం తప్పుకాదు కదా.

మౌలిక సిద్ధాంత పరంగానే ఉత్తర దక్షిణాలైన అనేక రాజకీయ సంఘాలు ఈరోజు ఒకటై, Common minimum programme. ఏర్పరచుకుంటూ వుంటే, ఈ మాత్రం కవుల మధ్య సయోధ్య అభిలషించటం ఎక్కువేమీ కాదు.

కావ్యాలలో పాప పుణ్య వివేచన ఉండాలి, పురాణాలను ఆధారంగా తీసుకుంటూ వుండాలి అనేది ఒక అభిప్రాయం తప్పులేదు. మన భారత రామాయణాల లాగే, గ్రీకుల 'ఇలియత్', 'ఒడిస్సీ'లు ఇప్పటికి గొప్ప రచనలుగా అందరూ ఒప్పుకుంటున్నారు కదా?

కావ్యాల్లో ఏ రసపోషణ ఉత్తమం అనేది చర్చనీయాంశము. ప్రతి మనిషీ అంతో ఇంతో విషాదాన్నే ఎక్కువగా ఇష్టపడతాడేమో. రచనల్లో కూడా బాధలేకుంటే గాథ లేదు. మనం వినే ఎన్నో మధుర గేయాలు వ్యధా భరితంగా, Meloncholగా వుండటం గమనిస్తాం. ఇవి ఆస్వాదించినపుడు మనం ఒకలాంటి ప్రక్షాళనకు లోనయినట్టు అనిపిస్తుంది. ఇదే ఆంగ్ల సాహిత్యంలో వినవచ్చే 'Katharsis' అనవచ్చా?! Katharsis leads us to a kind of purification process.

కావ్యదృష్టి పాఠకులలో సైతం వుంది. ఆ కవి ఎప్పుడూ పాఠకుల స్థాయికే దిగిరానక్కరలేదు. దిగివస్తే కవిత్వం, కావ్యం కుదరదు, కుదిరితే కవి ఆశయం నెరవేరదు్దా!? ఆ ఆశయం నెరవేరినపుడే కావ్యం నాల్గు కాలాల పాటు నిలుస్తుంది.

Poet describes an arc ! Reader Completes the circle.

అలా నిలవగల్గిన కావ్యాలే జన సామాన్యానికి నిత్య జీవన వ్యవహారాల్లో సైతం తోడుగా వుంటాయి. వేల సంవత్సరాల నాటి రామాయణ కథా విశేషాలు మనం రోజూ వాడుకపదాలుగా ఎలా వుంటున్నాయి. ఉదా : గీచిన గీటు దాటను, ఉడతా భక్తి, ఇలా ఎన్నో.

Study of Indian thought is necessary to strengthen the one-sided news of Europea thought - Dr. Winternits

సాహిత్యం గొప్పది. మన సాహిత్యం ఇంకా గొప్పది. దానిలో ఏదైనా మార్పులు చేర్పులు చేయాల్సి వస్తే చేద్దాం. మరి అందుకు సాహిత్య పఠనా వ్యాసంగాన్ని పెంపొందించు కోవటం మనందరి కర్తవ్యం కదా !

# మార్పు

- కుమార స్వామి

మార్పు నిరంతర ప్రక్రియ. చుట్టూ సమాజంలో జరిగే మార్పులు మనల్ని ప్రభావితం చేస్తాయి. మనలో మార్పు వస్తూ ఉంటుంది. అలాగే మన చర్యల ద్వారా పరిసరాల్లో కూడా మార్పులు వస్తూంటాయి. అంటే మార్పు పరస్పరాధారితం.

మనం ఒక పని చేస్తే ప్రపంచం, దాంతో పాటు మనమూ కొంచెమైనా మార్పు చెందుతాం. ప్రకృతిలో మార్పు అత్యంత సహజమైన జీవన ప్రక్రియ. మార్పు జీవచైతన్య కేతనం. మార్పుల పరంపరే చరిత్ర.

''ప్రపంచం మారదు. మనం దేన్నీ మార్చలేము. మనుషుల స్వభావం మారదు. ఈ సమాజం మారదు.'' అని చాలా మంది అంటూవుంటారు. ఇది నిజమా? సంఘంలో నీతి నియమాలు సాంప్రదాయాలు స్థిరంగా వుంటాయంటారు. దురాశ, అధికార వ్యామోహం, మానవ సహజ స్వభావాలని వాదిస్తారు. ఇవి ఏ మాత్రం మార్పు చెందని అంశాలేనా? గతానికి, నేటికి మార్పు లేదా? ఆది మానవుని కాలానికి, ఆధునిక కాలానికీ పోలిస్తే పైన పేర్కొన్న ఎన్నో విషయాలు చాలా మారినట్లు గుర్తించగలం.

'ఏదీ మారదు' అని చెప్పేవాళ్ళు యథాస్థితివాదులు. అంటే అభివృద్ధికరమైన మార్పును వ్యతిరేకించేవారని అర్థం. వీరి ప్రకారం మారేవన్నీ అబద్ధాలు. మారనివి వాస్తవాలు. పైకి కొన్ని యాదృచ్ఛిక సంఘటనలు కనిపించవచ్చు. తాత్కాలికంగా తిరోగమనంగా వుండవచ్చు. అయినా వీరెన్ని చెప్పినా ప్రపంచం నిరంతరం మారుతూవుంటుంది. అది ప్రగతిశీలదాయకం. అది అభివృద్ధికరమైన మార్పు వైపుకే పయనిస్తోంది.

**మార్పుకు కారణం ఏమిటి?**

**పరస్పర విరుద్ధ శక్తుల మధ్య జరిగే సంఘర్షణే కారణం.**

- హెరాక్లిటస్

**మానవాభ్యుదయం కొరకు ప్రపంచాన్ని మార్చవచ్చు. అలా మార్చడమే మానవుని పరమావధి**

- ఎపిక్యూరస్

మానవునిలో భావాలు ఎలా ఏర్పడుతున్నాయి? ''మెదడులో ఏర్పడుతున్నాయి'' అన్నారు ఫ్రెంచి

---

కుమారస్వామి, కన్వీనర్, సాహితీ స్రవంతి, శారదా నగర్, అనంతపురం.

సామాజికశాస్త్రవేత్తలు. అలాంటి భావాలే ఎందుకు ఏర్పడుతున్నాయి? సమాధానం చెప్పలేకపోయారు వారు. ఎందుకని? సమాజంలోని భౌతిక పరిస్థితులే మానవునిలో భావాలు ఏర్పడేందుకు కారణభూతమవుతాయి. విశ్వామిత్రుడు ఎంత నిష్ఠాగరిష్టుడైనా మేనక ఆయన చుట్టూ తిరుగుతూ నృత్యం చేయడంతో ఆమెను వలిచాడు. పది ఇళ్లకొకటి చొప్పున మద్యం షాపులు పెట్టడంతో మద్యపానప్రియులు పెరిగిపోతున్నారు. పాలకులు రైతుల వెతలు తీర్చకపోవడంతో రైతులు ఆత్మహత్యల వైపు నడుస్తున్నారు. ఆంగ్లేయుల దురాగతాలను సహించలేక స్వాతంత్ర్యం కోసం ప్రజలను ఐక్యంగా నడిపాడు గాంధీ. ఇవన్నీ భౌతిక పరిస్థితులను బట్టే మనిషిలో ఏర్పడ్డ భావాలేకాని ఎవరో ఆదేశించగా ఏర్పడినవి కావు. ఆనాటి ఫ్రెంచి సామాజిక శాస్త్రవేత్తలు, మనదేశ తాత్వికవేత్తలు చాలా మంది భౌతిక పరిస్థితుల ప్రభావాన్ని విస్మరించారు.

**ప్రపంచంలోని భౌతిక శక్తులే మార్పుకు కారణం. మొదట భౌతిక శక్తుల ప్రభావం మన ఆలోచనల మీద పడుతుంది. అప్పుడు మనకున్న సాధన సంపత్తితో ప్రపంచాన్ని మార్చడానికి పూనుకుంటాం.**

- మార్క్స్ ఎంగెల్స్

జీవానికి ప్రాథమిక విభాగం 'కణమని' మన పూర్వులు కనుగొన్నారు. కణ విభజన జరగడం వల్ల వృక్షాలు, జంతువులు ఏర్పడుతున్నాయని తెలుసుకున్నాం. కణం మార్పు చెందడం ద్వారా ఏ జీవి తన జాతిని మార్చుకోగలుగుతుందో తెలిసింది. అదేవిధంగా శక్తి నిత్యత్వ సూత్రం ( లా ఆఫ్ కన్సర్వేషన్ ఆఫ్ ఎనర్జీ) ప్రకారం వేడి, యాంత్రికశక్తి, విద్యుచ్ఛక్తి, అయస్కాంత శక్తి, రసాయనిక శక్తి మొదలైనవన్నీ ఒక రూపంలో నుంచి మరో రూపంలోకి మారిపోతాయని మనకు తెలుసు. ఒక రూపంలోని శక్తి మాయమైతే మరొక రూపంలో ఆ శక్తి ప్రత్యక్షమవుతుంది. అంటే ప్రకృతిలో వున్న చలనం యావత్తూ ఒక శక్తి మరో శక్తిగా మారే నిరంతర క్రమం. డార్విన్ పరిణామవాదం మానవునితో సహా జీవులన్నీ ఏక కణజీవుల నుంచి సుదీర్ఘ పరిణామ క్రమంలో ఉద్భవించాయని వివరించింది. ఈ ఏకకణ జీవులు కూడా రసాయనిక చర్యలలో పుట్టిన ప్రోటోప్లాజమ్ లేదా ఆల్బ్యూమెన్ నుంచి వచ్చాయని రుజువు చేసింది.

ప్రకృతిలో చలన శీలానికి
పరిణామం మనిషి
జగతిలోని భ్రమణగుణానికి
ప్రతిరూపం మనిషి

- సినారె ( విశ్వంభర)

వ్యక్తికీ, శాస్త్రానికీ, శాస్త్రీయ దృక్పథానికీ మధ్య వున్న సంబంధాలు దేశకాల పరిస్థితులను బట్టి మారుతూ వుంటాయి. సాంప్రదాయ బంధనాలు బలంగా వుంటే అశాస్త్రీయ శక్తులు రాజ్యమేలుతుంటాయి. శాస్త్రీయ విజ్ఞానం పెరిగేకొద్దీ ఇవి బ్రద్దలు అవుతాయి. అంతేగాక వ్యక్తి కూడా వికాసం చెందుతాడు. వ్యక్తులు వికసించే కొద్దీ సమాజం వికాసం చెందుతుంది. వ్యక్తి సామాజిక జీవనంలో క్రియాశీలకంగా పాల్గొనే కొద్దీ మరింత వికాసం చెందుతాడు. అందువల్లనే సామాజిక వికాసానికి, వ్యక్తి వికాసానికి పరస్పర సంబంధం వుంది. అందుకే వ్యక్తి వికాసం సమాజశాస్త్ర వికాసంలో అంతర్భాగమని అమర్త్యసేన్ వక్కాణించాడు.

## మార్పును పరిశీలించటం ఎలా?

మార్పు ఎల్లప్పుడూ నిరంతరంగా జరిగే ప్రక్రియ. మనం పరిశీలించినా, పరిశీలించకపోయినా మార్పు జరుగుతూనే వుంటుంది. కొన్ని బాహ్యంగా కనిపించకపోవచ్చు. అంతమాత్రాన మార్పు జరుగలేదని చెప్పలేం. దీన్ని బాగా పరిశీలించడం ద్వారానే గుర్తించగలం.

ఉదాహరణకు జామకాయను తీసుకుందాం. జామ చెట్టు ఒక మొగ్గ వేస్తుంది. ఆ మొగ్గ పువ్వుగా మారుతుంది. ఆ పువ్వు పిందెవుతుంది. పిందె పెరిగి జామకాయగా రూపుదిద్దుకుంటుంది. ఆ కాయ కొన్నాళ్ళకు పండిపోయి చెట్టు నుండి రాలిపోతుంది. ఆ తర్వాత అది కుళ్ళి మట్టిలో కలిసిపోతుంది. కొన్నాళ్ళకు దాని విత్తనాలు అనేక జామచెట్లుగా మారుతాయి. అంటే జామకాయ ఎల్లప్పుడూ కాయగానే వుండక, అది నిరంతరం మార్పు చెందుతూ వుంటుందన్న మాట.

జామకాయలో మార్పులు స్థూలంగా ఇలా వున్నాయి :

చెట్టు - మొగ్గ - పువ్వు - పిందె - జామకాయ- జామపండు - కుళ్ళిన పండు - జామ విత్తనాలు - విత్తనంలోంచి మొక్కలు - జామచెట్లు.

పై మార్పులన్నీ జామచెట్టులో గల కొన్ని అంతర్గత శక్తుల వల్ల జరుగుతున్నాయని గమనించగలం. అంటే పై మార్పుల్లో స్వయంగమనశక్తి ( ఆటో డైనమిజమ్) ఉందని అర్థం చేసుకోగలం.

మార్పును పరిశీలించటాన్ని గతితర్కం అంటాం. ఈ గతితర్కం ప్రపంచ పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి వుపకరించే ఏకైక సాధనమని హెగెల్ అనే తత్త్వవేత్త చెప్పాడు.

ఒక ఈగను పట్టుకుని చంపివేస్తే కలిగే మార్పు ఏది? కేవలం యాంత్రిక మార్పు. మన జోక్యం వల్ల జరిగిన మార్పు. కాని మన జోక్యం వల్ల జరిగే మార్పులన్నీ యాంత్రిక మార్పులు కావు. అందుకే మార్పులు జరుగుతున్న క్రమాన్ని పరిశీలిస్తే అవి కొన్ని చలనసూత్రాలను బట్టి జరుగుతుంటాయని గమనించగలం.

మార్పుకు సంబంధించిన చలన సూత్రాలే గతితార్కిక చలన సూత్రాలు. ఈ చలన సూత్రాల ఆధారంగా మార్పులను అధ్యయనం చేస్తే ప్రకృతిని, అందులోని సమాజాన్ని మనం అర్థం చేసుకోగలం. అభివృద్ధికర మార్పుల్ని వేగవంతం చేయటానికి మనం మార్పు చెంది మరికొంత వేగవంతం చేసే శక్తులుగా మారగలం. గతితార్కిక చలనసూత్రాల అధ్యయనం మన శాస్త్రీయ అవగాహనను పెంచుతుంది. తద్వారా కార్యాచరణ సులభమవుతుంది.

మార్పును శాస్త్రీయంగా పరిశీలించటానికి మనకు తోడ్పడేవి గతితార్కిక చలనసూత్రాలు... ఇవి ప్రధానంగా

### 1. వస్తువులపై పరిసరాల ప్రభావం వుంటుంది. పరిసరాలపై వస్తువు ప్రభావం వుంటుంది :

పరిసరాలకు వస్తువుకు పరస్పర సంబంధం వుంటుంది. వస్తువు గురించి తెలుసుకోవాలంటే బాహ్య ప్రపంచంలో దానితో సంబంధం వున్న అన్ని అంశాలను అధ్యయనం చేయాలి. దీనిని సంపూర్ణంగా మనం ఎన్నటికీ చేయలేం. కాని అన్ని కోణాలలో పరిశీలించాలన్న సూత్రం మనం తప్పులు చేయనీకుండా, పిడివాదులం కాకుండా రక్షిస్తుంది.

### 2. వస్తువును దాని అభివృద్ధి క్రమంలో, దాని మార్పులలో గ్రహించాలి :

వస్తువులో అంతర్గతంగా జరిగే మార్పులను గమనించాలి. ఆ మర్పులు సూక్ష్మంగా ఉంటాయి. వస్తువు అభివృద్ధి చెంది పెరిగి అదృశ్యమయ్యే దశల్లోకి వెళుతూంటుంది.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచనా విధానాలు మారాలి.

### 3. పరిమాణం గుణంగా మారుతుంది. గుణం పరిమాణంగా మారుతుంది. గుణపరిమాణ పరిణామ నియమం ఇది :

మార్పు ప్రేలుడులాగా వెంటనే జరిగిపోతుంది. సామాజిక విప్లవం సంభవించి పెట్టుబడీదారీ విధానం బద్దలై దాని స్థానంలో సోషలిజం వచ్చింది. భూమిపై ఉన్నట్టుండి జరిగిన మార్పుల వల్ల ప్రాణుల పరిణామం అకస్మాత్తుగా మారిపోయింది.

### 4. పరస్పర విరుద్ధ శక్తుల మధ్య ఐక్యత – ఘర్షణ వుంటుంది :

మొదటి వాదం వుంటుంది. దాంతోపాటే దానికి వ్యతిరేకంగా ప్రతివాదం వుంటుంది. అప్పుడు ఆ రెండింటి మధ్య సంఘర్షణ అనివార్యంగా జరుగుతుంది. ఆ సంఘర్షణ ఫలితంగా వాద ప్రతివాదాలలోని ప్రగతిశీల లక్షణాలను పునికి పుచ్చుకుని సమన్వయవాదం ఏర్పడుతుంది.

ఆ సమన్వయవాదం ఒకవాదం అవుతుంది. దాంతో దానికి ప్రతిగా ప్రతివాదం పుడుతుంది. మళ్ళీ ఆ రెండింటి మధ్య సంఘర్షణ జరిగి సమన్వయ వాదం వస్తుంది. అది తిరిగి మరొక నూతన వాదం అవుతుంది.

మనిషి మస్తిష్కంలోనూ సమాజంలోనూ సకల ప్రకృతి పరిణామాలలోనూ ప్రక్రియలోనూ పరస్పర విరుద్ధమైన అంశాలు వుంటాయి. విరుద్ధ అంశాల మధ్య ఐక్యత వుంటుంది. ఘర్షణ వుంటుంది. ఘర్షణ సమాజ అభివృద్ధికి మూలం.

గణితశాస్త్రంలో + మరియు -; అవకలనం, సమాకలనం

యాంత్రికశాస్త్రంలో చర్య ప్రతిచర్యలు
భౌతికశాస్త్రంలో ధన విద్యుత్తు, రుణ విద్యుత్తు
రసాయనశాస్త్రంలో అణువులు సంయోగ వియోగాలు
సామాజికశాస్త్రంలో పీడితులు, పీడించేవారు.
ఎన్నికలలో పార్టీల మధ్య వైరుధ్యాలు
పరిశ్రమల మధ్య - గుత్త సంస్థల మధ్య పోటీ

బహుళజాతి సంస్థల మధ్య పోటీ
దేశాల మధ్య పోటీ
(రెండూ విరుద్ధంగా వుంటాయి. కలిసి కూడా పనిచేస్తాయి)

## 5. అభావాన్ని అభావమొందిస్తుంది :

చిన్నతరహా పరిశ్రమ మెల్లమెల్లగా అభివృద్ధి చెంది తనను తాను అంతం చేసుకుంటుంది. అంటే లాభాలనార్జించి ఆ పెట్టుబడితో పెద్ద పరిశ్రమగా మారిపోతుంది. అదే విధంగా పెద్ద పరిశ్రమ కూడా అంతమయి పెట్టుబడీదారుడి నుంచి కార్మికుల పరిశ్రమయ్యే దశకు చేరుకుంటుంది. సాధారణ క్రమంలో పాతది నశించి కొత్తది మెరుగ్గా వుంటుంది.

## 6. ఆచరణాత్మక దృష్టితో పరిశీలన :

పరిశీలన ద్వారా, వివేచన ద్వారా నిర్ణయాలు చేస్తాం. కాని ఆ నిర్ణయాలు వాస్తవాలా? కాదా? ఎలా తెలుస్తుంది. ఆచరణలో వాటిని తేల్చుకోగలం. కేవలం ఊహల ద్వారా తేల్చలేం.

ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వస్తే వాటిని ఆచరణలో ఏది వాస్తవమో గ్రహించగలం.

## 7. సమాజాభివృద్ధికి అనుగుణంగా జరిగే మార్పులో మానవుని క్రియాశీలక పాత్ర వుంటుంది :

ప్రతిదీ మార్పు చెందటం అనివార్యం. మనిషి కూడా అందుకు అతీతం కాదు. మార్పు కేవలం అంతర్గత శక్తులవల్లే జరుగదు. బాహ్యప్రేరణలవల్ల మార్పు వేగవంతంగా జరుగుతుంది. శిశిరంలో ఆకురాల్చిన చెట్టు వసంతంలో చిగురిస్తుంది. అలా చిగురించటానికి బాహ్యప్రేరకాలుగా సూర్యరశ్మి, గాలిలో తేమ, చుట్టూ వాతావరణం పనిచేస్తాయి. అప్పుడే ఆ చెట్టు తన అంతర్గత శక్తులను వుపయోగించుకుని చిగురిస్తుంది. కోడిగ్రుడ్డు పిల్లగా మారటానికి కావలసిన ఉష్ణోగ్రత ఇవ్వగలిగితే ఇది జరుగుతుంది. నీరు ఆవిరిగా మారటానికి 100$^{o}$ సెంటీగ్రేడ్ వరకు వేడిచేయాలి. ఇవన్నీ బాహ్యప్రేరకాలు. అలాగే మనిషి మార్పు చెందాలంటే బయటి నుండి చైతన్యాన్ని అందించాలి. మనిషి ఒక్కసారి చైతన్యం పొందాక తాను మార్పును వేగవంతం చేసే శక్తిగా మారతాడు. ఈ చైతన్యాన్ని అందించగలిగేది శాస్త్రీయ దృక్పథం మాత్రమే. అందువలన ప్రతి వ్యక్తికీ శాస్త్రీయ దృక్పథాన్ని అందించటం అవసరమవుతుంది.

ఆదిమానవుని దశలో మనిషి మనుగడ కోసం పోరాడుతన్న దశలో నిప్పును, చక్రాన్ని కనుగొనడం యంత్ర పరికరాల అభివృద్ధికి దోహదం చేసింది. పశుసంపదను విచ్చలవిడిగా యజ్ఞయాగాదుల్లో వినియోగం వల్ల ఆజాతి అంతమయ్యే పరిస్థితిలో బుద్ధుడు హింసను మానాలని ప్రబోధించడంతో ప్రజలు బౌద్ధమతం వైపు వెళ్ళడంతో ప్రజాజీవన మార్గం కుదుట పడింది. రష్యాలో జార్ చక్రవర్తి నిరంకుశపాలనలో దుర్భర పరిస్థితి ననుభవించే ప్రజలు, బోల్షివిక్ పార్టీ వెనుక నడిచేందుకు ఆ దేశంలో విప్లవాన్ని తీసుకువచ్చేందుకు లెనిన్ అపూర్వ కృషి చేశాడు. తెలంగాణా సాయుధ పోరాటంలో పాల్గొన్న కమ్యూనిస్టు యోధుడు సుందరయ్య ''భాంచన్ దొరా! కాల్మొక్తా'' అని పలికే పీడితులను తమ హక్కుల కొరకు పోరాడే విధంగా కృషి చేశాడు. విశాలాంధ్రలో ప్రజారాజ్యంకై బాటలు వేశాడు.

**మానవ మేధకు పరీక్షా సమయం వస్తుంది. పరిపూర్ణ స్వీయవికాసమా – పరిపూర్ణ కర్తవ్యమా అని ఎంచి చూసుకునే అవసరం వస్తుంది.**

– డబ్ల్యు. బి. ఈట్స్

*References :-*


1. మనిషి కథ – సాంజగిరి
2. గతితార్కిక భౌతిక వాదం – సి.పి.ఎం. విద్యా బోధన పుస్తకం
3. గతితార్కిక పద్ధతి (వ్యాస సంకలనాలు) – మార్క్స్ ఏంగిల్స్ లెనిన్
4. విశ్వంభర – సినారె
5. మీరు మార్పు చెందాలనుకున్నారా? – బి.వి. పట్టాభిరామ్



**లఫాయేటీ**

చిత్రకారుడు : ఎఫ్.బి. మోర్స్



**గ్యాలరీ ఆఫ్ ద లోవర్**

చిత్రకారుడు : ఎఫ్.బి. మోర్స్